



Scanned with CamScanner

# వింతజలం

## బాలల కథల సంపుటి

నారంశెట్టి ఉమామహేశ్వరరావు, ఎమ్.ఏ.

సెల్ : 832 864 2583

ప్రచురణ:

జట్టు సేవాశ్రమం,

రాయగడ రోడ్, పార్వతీపురం.

Scanned with CamScanner

# వింతజలం

బాలల కథాసంపుటి

రచన: నారంశెట్టి ఉమామహేశ్వరరావు
94907 99203

ప్రథమ ముద్రణ: మే 2011
కాపీలు : 1000
వెల: 40 /-

హక్కులన్నీ గ్రంథకర్తవి

ముఖచిత్రం, లోపలి చిత్రాలు:
శ్రీ తుంబలి శివాజీ, 9849227509
లే అవుట్ డిజైనింగ్: గోత్ర

ప్రతులకు :
1) జి.అమ్మాజీ, ఎమ్.ఏ., బి.ఎడ్.,టీచర్
W/O ఎన్. ఉమామహేశ్వరరావు
సరస్వతీనివాస్, గవర్నమెంట్ హాస్పిటల్‌రోడ్, బెలగాం,
పార్వతీపురం, హెచ్.ఓ., ఆం.ప్ర.
మొబైల్: 94907 99203, [illegible] 9985359091
2) జట్టు సేవాశ్రమం, రాయగడ రోడ్,
పార్వతీపురం, హెచ్.ఓ.- 535501.
మొబైల్: [illegible], [illegible].

# అభినందన

శ్రీ నారంశెట్టి ఉమామహేశ్వరరావు వృత్తి రీత్యా తపాలా శాఖలో ఇన్స్‌పెక్టర్ స్థాయి అధికారి. వృత్తిలో అత్యంత కీలకమైన బాధ్యతలు నిర్వహిస్తూనే, ప్రవృత్తి రీత్యా కథాసేద్యం చేస్తున్నారు. ప్రత్యేకించి కథా సాహిత్యంలో బాలల కథా సాహిత్యంపై గత ఇరవై అయిదు సంవత్సరాలుగా కృషి చేస్తున్నారు.

'వింతజలం' శీర్షికన వెలుగులోకి తీసుకొస్తున్న బాలల కథాసంపుటికి ఓ రెండు మాటలు రాయడం నా ధర్మం.

అధ్యయనం, ప్రత్యేకించి సృజనాత్మక సాహిత్యం చదవడానికి నేటిబాలలకి అవకాశం అతి తక్కువ. కాన్వెంటు చదువుల మోజులో పడి 'కెరీర్' పైనే ధ్యాసతో చదువులు కొనసాగిస్తున్నారు. తెలుగు మాధ్యమంలో చదువు నిరాదరణకు గురౌతున్న రోజులివి. ఈ చీకటి వాతావరణంలో వెలుగును పంచేందుకు సన్నద్ధమైంది ఈ 'వింతజలం'. నిజానికి పరాధీనమైపోతున్న తెలుగు భాషా సౌందర్యాన్ని, వారసత్వాన్ని పునఃప్రతిష్ఠ చేయడానికి ఓ 'వింతజలం' కావలసిందే. ఈ సంపుటిలోని అన్ని కథల కంటే నిడివి ఎక్కువ కల కథ 'వింతజలం'. పిల్లలకిష్టమైన రాజుల కథ ఇది. ఇందులోని అద్భుతాలు, సాహసం, కథాంతాన విజయం పిల్లల్ని తప్పక అలరిస్తాయి.

అన్ని కథల్ని ఒక్క బిగువున చదివితే అర్థమైన విషయం రచయిత చేయితిరిగిన నైపుణ్యం. కథలన్నీ సరళంగా వడివడిగా నడుస్తుంటాయి. పఠితల్లో ఉత్కంఠను కలిగిస్తుంటాయి. వింతజలం కాక మిగతా కథలు దాదాపు పోస్టుకార్డు నిడివి కల కథలనవచ్చు. తక్కువ నిడివిలో ఎక్కువ అర్థాన్ని కలిగించేలా రాయడం రచయిత ప్రతిభకు తార్కాణం. ప్రతి కథ ఏదో సందేశాన్ని అందిస్తుంది. విలువలతో కూడిన విద్యలా ప్రతి కథ పిల్లల్లో మంచి అలవాట్లను, నడవడికను పెంచేందుకు తోడ్పడుతుంది. సోమరితనం మంచిది కాదు, కష్టపడితీరాలన్న స్పృహ (సమస్య), ఆస్తి కర్పూరం లాంటిదన్న ఓ ఉదాత్తమైన వేదాంత సత్యం(కర్పూరం), జాలరికన్నా తెప్పపై ప్రయాణం చేసేవాళ్ళకి ధైర్యం ఉండాలన్న మంచి ప్రతిధ్వనితో ఉన్న కథాసందేశం(ధైర్యం), చెప్పుడుమాటలు కాదు స్వంత ఆలోచన ఉండాలన్న నీతి (నిజమైన జోస్యం, అపోహ), ఉపాధ్యాయులు జ్ఞానప్రదాతలు, తల్లిదండ్రులు ఎల్ల వేళలా మంచిని కోరతారన్న సందేశం (జ్ఞానోదయం), వ్యక్తికి ఆధ్యాత్మిక చింతన ఉండాలన్న కోరిక (తమసోమా జ్యోతిర్గమయ), ఉత్తమ ధీరోదాత్తత (మణిశేఖరుడు), పిసినారితనం మంచిది కాదన్న సందేశం (పిసినారి దానం), వ్యక్తి ఎదగాలంటే సరియైన సలహా అవసరమన్న సందేశం (సలహా) ఈ కథాసంపుటి మనకందించే అక్షర సందేశాలు. పిల్లలకే కాదు, పెద్దలకూ ఇవన్నీ అవసరమే.

తల్లిదండ్రులుగా పిల్లల్తో ఈ కథల్ని చదివించడం మన బాధ్యత. "సలహా" కథలా ఇంకా ఎన్నో లౌకికమైన కథలను పిల్లలకి అందించాలని మనసారా కోరుకుంటూ శ్రీ నారంశెట్టి ఉమామహేశ్వర రావుని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను.

- యెన్నం ఉపేందర్,
డైరెక్టర్ ఆఫ్ పోస్టల్ సర్వీసెస్,
విశాఖపట్టణం.

Scanned with CamScanner

# "కథలతో కౌన్సిలింగ్ బాధ్యతను భుజాన వేసుకున్న నారంశెట్టి"



కథలు అందరికీ ఇష్టమే, పిల్లలికి మరీను. కథలు చదవటానికి ముందు - వినటం అలవాటు కావాలి. తాతయ్యలు, అమ్మమ్మలు పసివాళ్లను దగ్గర కూర్చోబెట్టుకుని కమ్మని కథలు చెప్పే సంస్కృతి ఇప్పుడు కరవయ్యింది. కథలు చెప్పి పిల్లల వ్యక్తిత్వ నిర్మాణానికి పునాదులు వేసే పెద్దవాళ్ళంతా వృద్ధాశ్రమాలలో ఉంటున్నారు. ఇంట్లోని అమ్మానాన్నలు ఉద్యోగ బాధ్యతలతో పిల్లలకి కథలు చెప్పే తీరిక లేకుండా ఉన్నారు.

కథలు వినటం అలవాటైతే- చదవటం అలవాటవుతుంది. కథల పుస్తకాలు ఎప్పుడైతే చదువుతారో, పిల్లలు పాఠ్యపుస్తకాలనూ అంతే ఆసక్తిగా చదువుతారు. అంటే కథలు, చదువుకి సపోర్ట్ అన్నమాట!

ఇంట్లో ఉండి పిల్లలకి కథలు చెప్పి కౌన్సిలింగ్ చేసే పెద్దల బాధ్యతను నారంశెట్టి ఉమామహేశ్వరరావు లాంటి బాలసాహిత్య రచయితలు భుజాన వేసుకున్నారు. ఆ బాధ్యతలో భాగంగా నారంశెట్టి 'మేలెరిగిన మనిషి' పిల్లల కథల పుస్తకం తరువాత 'వింతజలం' రెండో పుస్తకంగా తెలుగుబాలలకు కానుకగా అందిస్తున్నారు.

అయిదొందలకు పైగా కథలు రాసిన నారంశెట్టి ఉమామహేశ్వరరావు కలంలో సరళమైన భాష ఉంది. బాలల మనసులను తట్టి పలకరించి పులకరింప జేసే శైలి ఉంది. కొసమెరుపు సందేశంతో సమ్మోహితులను చేసే చమత్కారం ఉంది. అందుకే అన్ని పిల్లల పత్రికలూ ఆయన రాసిన కథలను అపురూపంగా ఆదరించి ప్రచురించాయి.

విలువలతో కూడిన విద్య (Value Education) పిల్లలకు నేర్పాలని తపన పడేవారు నారంశెట్టి ఉమామహేశ్వరరావు రచనలు చదివిస్తే చాలు. వారి ఆశయం నెరవేరుతుంది. ఆ పని జట్టు సేవాశ్రమం వారు చేపట్టి చేస్తున్నందుకు వారిని అభినందించాలి. విద్యార్థుల అవగాహనకు అందని గ్రంథాలను నాన్-డిటైల్డ్‌గా పెట్టి పిల్లల సహనాన్ని 'పరీక్షి'ంచే బదులు ఇలాంటి పుస్తకాలకు అవకాశం కల్పిస్తే సార్థకత ఉంటుంది.

పిల్లల మనసెరిగి నిబద్ధతతో రాస్తున్న ఆత్మీయ మిత్రుడు, బాలసాహితీ శిల్పి, సహస్రాబ్ది అవార్డు గ్రహీత నారంశెట్టి ఉమామహేశ్వరరావు నుండి ఇలాంటి కథాసంపుటాలు మరిన్ని రావాలని మనసారా కోరుకుంటున్నాను.

- చొక్కాపు వెంకటరమణ,
అధ్యక్షులు, బాలసాహిత్యపరిషత్,
cell : 92465 20050
e-mail: magiccho@gmail.com

Scanned with CamScanner

# బాలలను ఆకట్టుకొనే కమ్మని కథలు



తెలుగు ప్రౌఢవాఙ్మయంలో పద్య కవిత్వం దాదాపు వెయ్యి సంవత్సరాలనుంచి ఉందనేది అందరూ ఎరిగిన సత్యం. తెలుగు బాల సాహిత్యంలో గేయం కన్నతల్లి ఉనికి ఉన్నప్పట్నుంచీ ఉంది. కన్నతల్లి బిడ్డను ఆలిస్తూ, పాలిస్తూ అలవోకగా పాడిన పాటలు ఏనాటివంటారు? అంచనా కట్టలేని వేలాది సంవత్సరాలనాటిది. అంతటి అపూర్వ ప్రాచీన చరిత్ర బాలవాఙ్మయానికుంది. దీనిలో ఒక భాగమే బాలల కథలూ– మన తాతయ్యలు, అమ్మమ్మలు, జేజెమ్మలు తాము విన్న, కన్న కథలు చెప్పి, మరికొన్ని కల్పించి చెప్పి బాలలకు ఆనందింపజేసేవారు. బాలల కోసం ముద్రిత కథల చరిత్ర వంద సంవత్సరాలకు మించి లేదు. అముద్రిత కథల చరిత్ర, అనూచానంగా మన కుటుంబ వాతావరణంలో మొలచిన, పెరిగిన కథల వయసుకు చారిత్రక ఆధారాలు లేవు. మానవుని మనుగడ, ఉనికి పరస్పరాశ్రితాలుగా మన సమాజంలో నిలిచి ఉన్నాయి.

వాస్తవానికి పిల్లల కథలు వారి హృదయాలను ఉయ్యాలలూపుతాయి. అవగాహనను పెంచుతాయి. మనోభవనపు కిటికీలు తెరుస్తాయి.సిగ్గును బిడియాన్ని పోగొడతాయి. వారిలో జిజ్ఞాసా పరిధిని పెంచుతాయి. అందుకే పిల్లల పోషణలో ఒక భాగం పుష్టికరమైన ఆహారంతోబాటు, ఆరోగ్యకరమైన, ప్రబోధదాయకమైన బాల సాహిత్యం చదివే అలవాటు నేర్పవలసి ఉంది.

విజయనగరం జిల్లాలో, పార్వతీపురం ఒక గ్రామం. రాష్ట్రంలోని పాతిక వేల గ్రామాలలో ఇదొకటి. కాని ఈ గ్రామంలో పదిమందికి పైగా బాలసాహిత్య రచయితలుండడం ఒక ప్రత్యేకత. ఈ ప్రాంతం ఆర్థికంగా కొంత వెనుకబడినా, సాహిత్యపరంగా వెనుకబడలేదనే చెప్పాలి. అతి పెద్ద పట్టణాలైన విశాఖపట్నం, రాజమండ్రి, విజయవాడ, గుంటూరులలో – ఏ ఒక్క పట్నంలో ఇంతమంది బాలసాహితీపరులు లేరంటే ఆశ్చర్యపోవాలి మరి! అదీ పార్వతీపురానికి సరస్వతీదేవి ఇచ్చిన వరం. అచటి రచయితలంతా వరపుత్రులే కదా!

ఈ గ్రామంలో పుట్టి పెరిగిన వర్ధిష్ణువు, కథ సృజనలో మేటి నారంశెట్టి ఉమామహేశ్వరరావు. వీరు 'వింతజలం' అనే పెద్ద కథతోబాటు, మరో పదికి మించి కథలను చేర్చి సంపుటంగా రూపొందించారు. ఇది వీరి రెండో సాహిత్య సంతానం. వింతజలం– ఓ జానపద కథ. కల్పనా చాతుర్యం గల కథ. ఒకానొకప్పుడు ధవళరాజ్యాన్ని మనోహరుడు అనే రాజు పరిపాలించాడు. ప్రజల ఆదరాభిమానాలను సంపాదించినవాడు. రాజ్యంలోని ప్రజలు ఒక కొత్త అంటువ్యాధి సోకి అంధులైపోతున్నారు. ఈ పరిస్థితి రాజుగారికి ఆందోళన కలిగించింది. దీని మార్గాంతరం

Scanned with CamScanner

కోసం రాజవైద్యుల సలహా కోరినా ఫలితం లేకపోయింది. అంధత్వనిరారణ మార్గం చూపిన వారికి అర్ధరాజ్యం ఇస్తామని చాటింపు వేశారు. అపుడు ఒక ముని ముందుకు వచ్చి - వరుణాచలం లోగల "వింతజలం" సంపాదిస్తే, వ్యాధి నయం చేయగలదన్నారు.

ఇందుకోసం రాజభటులు ప్రయత్నించారు. మిగతావారు ప్రయత్నించారు. ఫలితం లేక పోయింది. అయితే శేఖరుడు అనే యువకుడు పలు ప్రయాసలకోర్చి, తీవ్ర ప్రయత్నం చేసి, పలు సాహసాలు చేసి, వింతజలం సంపాదించి ధవళరాజ్యంలో ప్రజలు అంధులైపోకుండా కాపాడాడు. అపుడు రాజుగారు శేఖరునికి అర్ధరాజ్యం ఇవ్వడమే కాకుండా, తన కుమార్తె విజయలక్ష్మిని ఇచ్చి వివాహం చేశారు. కృషి ఉంటే- ఏదైనా సాధించవచ్చునే సందేశాన్ని బాలలకు ఈ కథ ఇస్తుంది. ఇది బాలసాహిత్య ప్రయోజనాలలో ఒకటి.

ఈ సంకలనంలో నిజమైన జోస్యం, ఒక మంచికథ. ఒక వ్యాపారి తన శక్తిని, తెలివితేటలను వినియోగించకుండా, ఆయన సంపాదన కోసం జ్యోతిష్యంపై ఆధారపడతాడు. జ్యోతిష్కుడు 'చెప్పుడు మాటలు వినకపోతే లాభిస్తుంది' అని సలహా ఇస్తాడు. అయితే వ్యాపారి మిత్రుడు ప్రక్క గ్రామంలో అపరాల ధర తక్కువగా ఉంది, వాటిని కొని అమ్ముకుంటే బాగా లాభిస్తుందని సలహా ఇస్తాడు. కానీ మన వ్యాపారి జ్యోతిష్కుని మాట నమ్మి మిత్రుని సలహా లెక్కచేయడు. మిత్రుడు అపరాలు కొని చాలా లాభిస్తాడు. వ్యాపారి మిత్రుని మాట విననందుకు చాలా నష్టపోతాడు. సొంత ఆలోచన అవసరం అనీ, జ్యోతిష్కుని మాట నమ్మరాదనీ తరువాత తెలుసుకొని పశ్చాత్తాపపడతాడు. ఇందలి తాత్పర్యం అందరికీ వర్తిస్తుంది.

ఈ సంకలనంలో మరో బుల్లికథ, సమస్య అనేది. కోటలో ఉచిత భోజనాలు సమస్యగా మారినపుడు, సోమరిపోతుల సంఖ్య బాగా పెరిగినపుడు 'త్వరలో పెద్ద యజ్ఞం చేయబోతున్నాం, అందు ఒక సోమరిని బలిపశువుగా ఉపయోగిస్తాం. సిద్ధంగా ఉండండి' అనే ప్రకటన చేశాక ఒక్క సోమరీ కోటలో ఉచిత భోజనానికి రాడు. ఆ విధంగా రాజుగారు సమస్య పరిష్కరిస్తారు.

ఇలా ఈ సంపుటంలో ప్రతి కథ సందేశాత్మకంగా, వినోదాత్మకంగా, చిరకాలం నిలిచేవిగా ఉన్నాయి. ఈ గ్రంథం వలన నారంశెట్టి ఉమామహేశ్వరరావుగారికి బాలకథాసాహిత్యంలో సముచిత స్థానం లభిస్తుందని నా విశ్వాసం. వారికి నా శుభాశీస్సులు. శుభాకాంక్షలు.


*- డా॥ వెలగా వెంకటప్పయ్య,*
"బాలబంధు"

ఐతానగరం
తెనాలి.

# కథావళి


1. వింతజలం ........ 15
2. సమస్య ........ 25
3. వీడిన భయం ........ 26
4. ఎంపిక ........ 28
5. కొంటె దెయ్యం ........ 30
6. రెండు ప్రశ్నలు ........ 32
7. జ్ఞానోదయం ........ 34
8. పిసినారి దానం ........ 36
9. మణిశేఖరుడు ........ 39
10. నిజమైన జోస్యం ........ 44
11. అసలైన అర్హుడు! ........ 46
12. కర్పూరం ........ 48
13. గర్వభంగం ........ 49
14. సలహా ........ 50
15. అపోహ ........ 51
16. తమసోమా జ్యోతిర్గమయ........ 54
17. ధైర్యం ........ 57
18. సరికి సరి........ 58
19. వేళావిశేషం........ 59
20. యువకుని ధైర్యం........ 60
21. ఎవరు గొప్ప........ 61
22. దాగిన నిజం........ 62


Scanned with CamScanner



# వింతజలం

పూర్వం ధవళరాజ్యాన్ని మనోహరుడు అనే రాజు పరిపాలించేవాడు. అతడు చాల మంచివాడు. ప్రజలను కన్నబిడ్డల వలె పరిపాలించి వారి అభిమానం పొందేవాడు.

ఆ రాజ్యానికి ఓ కొత్త భయం పట్టుకుంది. ఆ రాజ్యంలోని ప్రజలు ఒక కొత్త వ్యాధి సోకి అంధులైపోతున్నారు. అది గొప్ప భయం కల్గించింది ప్రజల్లో! ఈ రోజు ఈ ఊరులో ప్రజలు అంధులై పోతుంటే మరుసటి రోజు ఆ గాలి తగిలి ప్రక్క ఊరు ప్రజలు అంధులైపోతున్నారు. అది అంటువ్యాధి అని గ్రహించిన రాజు వైద్యుల్ని పంపి ఆ వ్యాధి నయం చేసి ప్రజలకు సుఖశాంతులు కలిగించమని చెప్పాడు.

ఎందరో వైద్యులు రాత్రనకా, పగలనకా శ్రమించినా ఆ వ్యాధి తగ్గలేదు. మరో ప్రక్క కొత్త వారు కూడ అంధులైపోతున్నారు. ఆ వ్యాధి కొత్తది కావడంతో తగిన మందులేవీ లేవు. రాజవైద్యులతో సహా ఎవరూ నివారణోపాయం సూచించలేకపోతున్నారు.

మహారాజు ఈ విషయంలో జాప్యం చేయదలచలేదు. పొరుగుదేశాలకు కబురుపంపి మహామహా వైద్యులను పిలిపించాడు. వారు కూడా అది తమవల్ల జరిగేపని కాదన్నారు. ఏమి చేయాలో అంతా చేస్తున్నారు. అయినా ఫలితం శూన్యం.

మహామంత్రి విజ్ఞుడు రాజు మనోహరుడిని కలిసి తన ఆందోళన వ్యక్తం చేశాడు. మనోహరుడు



Scanned with CamScanner

'మంత్రివర్యా! మనం చేయవలసినదంతా చేశాం! మరి ఇకపై మనవల్ల కాదేమో నన్పిస్తోంది" అన్నాడు బాధగా!

మహామంత్రి విజ్ఞుడు మనోహరుడికి ధైర్యం చెబుతూ సుదీర్ఘ ప్రసంగం చేశాడు. అందులో "రాజా! ఈ వ్యాధి ఎంత భయంకరమైనదీ అంటే అది సోకిన పక్షం రోజుల్లో రాజ్యంలో సగం మంది అంధులయ్యారు. అయినా ఆ వ్యాధి ప్రభావం తగ్గలేదు. ఇంకా వ్యాపిస్తూనే ఉంది. దీనికి భయపడి మన రాజ్యప్రజలు వలస వెళ్ళిపోయి పొరుగు రాజ్యాల్లో నివసిస్తున్నారు. మనం ఉపేక్షిస్తే లాభంలేదు. మనం కూడా అంధులమైపోవడం ఖాయమనిపిస్తోంది. ఈ వ్యాధి మామూలు మందులకి తగ్గదు. మహిమలవల్ల నయినా తగ్గుతుందో లేదో పరీక్షించాలి. అందుకోసమై మనం ఓ చాటింపు వేయించి – ఈ అంధత్వాన్ని నివారించే ఉపాయం గానీ, మందు సాధించేందుకు మార్గం గానీ చెప్పిన వారికి విలువైన బహుమతి ఇస్తామని ప్రకటిద్దాం! అలా అయితే ఎవరైనా మహాత్ములు, మహిమాన్వితులు వచ్చి మనకు సాయపడితే ఈ గండం నుండి బ్రతికి బయటపడతాం" అన్నాడు.

రాజుకొద్దిసేపు ఆలోచించి 'సరే' నన్నాడు. వెంటనే చాటింపు వేయించారు. చాటింపు వేసి రెండు రోజులు దాటినా ఎవరూ దాని విషయమై రాకపోవడంతో రాజు, మంత్రి ఆందోళన చెందారు. మంత్రి రాజుగారితో చాలాసేపు మాట్లాడి తర్వాత మరో చాటింపు వేయించాడు.

దాని సారాంశం ఏమిటంటే – ఈ అంధత్వాన్ని నివారించే మార్గం ఏదైనా చెప్పినా, చేసి చూపించినా వారికి అర్ధరాజ్యం ఇచ్చి గౌరవిస్తారు.

ఈసారి కూడా రెండు రోజులు దాటినా ఎవరూ రాలేదు. మంత్రి, రాజు ఆందోళన చెందుతున్న సమయంలో ఓ భటుడు వచ్చి "రాజా! మీ దర్శనం కోరి ఓ ముని వేచి యున్నారు" అని చెప్పాడు. మనోహరుడు లోపలకు పంపమని ఆజ్ఞ ఇచ్చాడు.

ఆ ముని పేరు మణిశేఖరుడు. అతడు గొప్ప తపఃశక్తి సంపన్నుడు. మహారాజు వేసిన చాటింపు విని ఉపాయం చెప్పేందుకు వచ్చాడతను. కాని రాజు ఇస్తామన్న అర్ధరాజ్యం తీసుకోవాలన్న ఉద్దేశం లేదతనికి!

మనోహరుడు మునికి నమస్కరించి "మునివర్యా! గొప్ప ప్రమాద పరిస్థితిలో ఉన్న నా రాజ్యాన్ని కాపాడే ఉపాయం చెప్పగలరా?" అని ప్రార్థించాడు.

దానికి ఆ ముని "రాజా! నీ చాటింపు వినే వచ్చాను నేను. కానీ అర్ధరాజ్యం కోసం మాత్రం కాదు. ఆ వ్యాధిని అంతం చేసే మందు ఇదీ అని చెప్పలేను. కానీ మా గురువుగారు చెప్పగా ఓ సారి విన్నాను. పూర్వం మగధ రాజ్యానికి



Scanned with CamScanner

ఇలాంటి వ్యాధే సోకితే వరుణాచలం అన్న ప్రదేశంలో గల వింత జలంతో ఆ వ్యాధిగ్రస్థుల కళ్ళు కడిగించారుట! దానివల్ల వారి వ్యాధి నయమైందట! అలాగే ఆ వ్యాధి అప్పటి వరకూ సోకనివారు ఆ జలాన్ని ముందుగానే కళ్ళకు తాకిస్తే వారికి ఆ వ్యాధి రాదుట! ఈ విషయం ఆయన చెప్పగా విన్నాను. ఇది ఎంతవరకూ నిజమో నాకూ తెలియదు. అసలు వరుణాచలం అన్న ఆ ప్రాంతం ఉందో, లేదో, ఉంటే ఎక్కడ ఉందో కూడా చెప్పలేను" అన్నాడు.

మహారాజు మనోహరుడు మునిపాదాలు తాకి "మహానుభావా! ఈ మాత్రం ఉపాయం చెప్పారు. చాలా సంతోషం! మేము సర్వవిధాలా ప్రయత్నిస్తాం! అది సాధించి ఆ వ్యాధి అరికట్టగలమనే ఆశిస్తున్నాం! ఏది ఏమైనా సమయానికి మమ్మ ఆదుకున్నందుకు కృతజ్ఞతలు" అన్నాడు.



ఆ ముని రాజుగారి దగ్గర సెలవు తీసుకుని వెళ్ళిపోయాడు. ఆ ముని వెళ్ళిన వెంటనే రాజు మంత్రితో కలిసి ఆలోచించి మరో చాటింపు వేయించాడు. అందులోని సారాంశం ఇది!

"వరుణాచలం అన్న ప్రదేశంలో గల వింత జలం తెచ్చిన వారికి యువరాణి విజయలక్ష్మితో వివాహం జరిపించి అర్ధరాజ్యం ఇవ్వబడుతుంది".

ఆ రోజు నుండి ఎందరో ఉత్సాహవంతులైన యువకులు వచ్చి మహారాజుని కలుసుకుని "రాజా! మేము వెళ్ళి వింత జలాన్ని సంపాదిస్తాం" అనసాగారు. రాజు వారందరికీ ఒక్కొక్క గుఱ్ఱం, ఖడ్గం ఇప్పించాడు. అలా ఎంతమంది

వెళుతున్నారో అందరికీ ఇప్పించాడు.

ఇది జరిగి పదిహేను రోజులు దాటినా ఎవరూ జలం తీసుకుని రాలేదు. కనీసం ఆ ప్రదేశాన్ని కనుక్కున్నామని ఒక్కరూ చెప్పలేదు. పడమర, తూర్పు, దక్షిణ దిశలకు వెళ్ళినవారంతా ఒక్కరొక్కరే తిరిగి రాసాగారు. వారు అలాంటి పేరుగల ప్రాంతం ఆవైపే లేదు" అని చెప్పారు.

మరి ఉత్తర దిక్కుకు వెళ్ళిన వాళ్ళు ఇంతవరకూ ఎందుకు రాలేదో ఎవరికీ అర్థం కాలేదు. పోనీ అలాంటి ప్రాంతం లేకపోతే ఉత్తి చేతులతో అయినా తిరిగి రావాలి కదా! అదీ లేదు. మహారాజులో ఆందోళన బయలుదేరింది.

* * * *

శేఖరుడు పేదకుటుంబంలో పుట్టాడు. అందచందాలు, ధైర్యసాహసాలు కలవాడు. అతడు చిన్నప్పటి నుండి ఎన్నో కష్టాలు అనుభవిస్తూ పెరిగి పెద్దవాడయ్యాడు.

అతడు విద్యాభ్యాసం ముగించి గురువుగారి వద్ద ఆశీస్సులు పొంది సభ్యమానవ ప్రపంచంలో అడుగు పెట్టాడు. అతడికి తన రాజ్యంలో వ్యాపించిన అంధత్వ వ్యాధి గురించి తెలిసింది. దాంతో బాటు రాజుగారు వేయించిన చాటింపూ తెలిసింది. ఇవేకాక ఉత్తర దిశకు వెళ్ళిన ఏ ఒక్కరూ తిరిగి రాలేదన్న విషయం కూడా తెలిసింది.

దాంతో అతనిలో పట్టుదల కలిగింది. తనదేశానికి ఏమైనా మేలుచేయాలనీ, తన ధైర్యసాహసాలు నిరూపించుకోవాలనీ అనిపించింది. అలా అనుకున్న మరుక్షణం అతడు రాజుగారిని కలిసేందుకు ప్రయాణమయ్యాడు.

తానెందుకు వచ్చిందీ వివరిస్తూ భటులచే రాజుగారికి కబురు పంపాడు. రాజు అతన్ని ప్రవేశపెట్టమన్నాడు. శేఖరుడు రాజు గారికి నమస్కరించి "రాజా! నేను ఉత్తరదిశగా వెళ్ళి వింతజలం విషయంలో ప్రయత్నిస్తాను. నాకు ఉత్తమజాతి అశ్వం, మీరు యుద్ధాల్లో పాల్గొనేటప్పుడు ఉపయోగించే ఖడ్గం ఇప్పించండి" అన్నాడు.

రాజు ఆ యువకుడి వైపు ఆశ్చర్యంగా చూస్తూ "బాబూ! నీవెవరవు? చాలా మంది ఉత్తర దిశగా వెళ్ళి తిరిగి రాలేకపోయారని నీకు తెలుసా? అలా తెలిసే వెళ్ళడానికి సిద్ధమవుతున్నావా?" అని ప్రశ్నించాడు.

శేఖరుడు వినయంగా "రాజా! అన్ని విషయాలూ నాకు తెలుసు. ఉత్తర దిశగా వెళితే విజయం సాధిస్తానన్న నమ్మకం నాకుంది. ఎంతో మంది ఉత్తర దిశగా వెళ్ళి రాలేకపోయినంత మాత్రాన నేను రాలేనని అనుకోవద్దు! అవసరమయితే దేశంకోసం ప్రాణాలర్పించడానికైనా సిద్ధమే! మీరు నన్ను శంకించవద్దు" అన్నాడు.



Scanned with CamScanner

"నిన్ను ప్రోత్సహావరుస్తానే కానీ శంకించను" అంటూ శేఖరుడు అడిగినట్లుగా అతడికి ఉత్తమ జాతి అశ్వం, మంచి ఖడ్గం ఇప్పించాడు. శేఖరుడు రాజుగారి వద్ద సెలవు పొంది అక్కడ నుండి బయలుదేరాడు.


* * * *

శేఖరుడు ఉత్తర దిశగా మూడు రోజులు ప్రయాణం చేసి నాల్గవరోజుకు మాళవ రాజ్యాన్ని చేరుకున్నాడు. ఆ రాజ్యంలోని ఓ గ్రామంలో ఆగి 'వరుణాచలం' గురించి అడిగాడు. ఎవరూ తమకు తెలుసునని అనలేదు. శేఖరుడు అలా దాని గురించి ప్రశ్నిస్తూ చాలా గ్రామాలు దాటి ముందుకు ప్రయాణించాడు.

విష్ణుపురం అన్న ఊరులో ఒక వ్యక్తి మాత్రం సరైన జవాబు చెప్పకపోయినా కొంత ఉపయోగపడే జవాబు చెప్పాడు. అతడు "బాబూ! నీవు అడిగిన ప్రదేశం నాకు తెలియదు, కానీ నీకు దాని గురించి చెప్పగల వ్యక్తిని మాత్రం చూపగలను" అన్నాడు.

శేఖరుడు ఆనందంతో అతన్ని కూడా గుఱ్ఱంపై కూర్చుండబెట్టుకొని ఒక ప్రదేశానికి వెళ్లాడు. అక్కడ ఓ బౌద్ధ భిక్షువు ఓ చెట్టు నీడలో కూర్చుని విశ్రాంతి పొందుతున్నాడు.

బౌద్ధ భిక్షువువద్దకు వెళ్ళి నమస్కరించి నిలిచాడు శేఖరుడు. అతను కళ్ళు తెరిచి శేఖరుడిని చూస్తూ, "ఏం బాబూ! నానుండి ఏదైనా సహాయం ఆశిస్తున్నావా?" అని అడిగాడు.



శేఖరుడు క్లుప్తంగా తానెందుకు బయలుదేరిందీ వివరించి సహాయపడమని కోరాడు.

ఆ బౌద్ధ భిక్షువు క్షణకాలం ఆలోచించి "బాబూ! వరుణాచలం అన్న ప్రదేశం నేను వెళ్లాను. అక్కడ వింతజలం ఉన్నమాట వాస్తవమే! నేను ఆ జలాన్ని కళ్ళకు తాకించాను కూడా! ఆ ప్రాంతం వెళ్ళాలంటే ముందు నీవు 'హిమగిరి' రాజ్యాన్ని చేరుకోవాలి! అక్కడనుండి



'మణిపురి' అన్న ప్రదేశాన్ని చేరుకోవాలి. మణిపురినుండి తెల్లకొండలమీదుగా మూడు రోజులు కాలినడకన ప్రయాణం సాగిస్తే వరుణాచలం చేరుకుంటావు. అక్కడే వింత జలం లభ్యమవుతుంది" అన్నాడు.

శేఖరుడు అంతా శ్రద్ధగా విన్నాడు. "స్వామీ! మీరు ఆ ప్రాంతానికి నడిచే వెళ్ళారా?" అని ప్రశ్నించాడు.

బౌద్ధ భిక్షువు నవ్వి, "బాబూ! నాకు కొన్ని మహిమలున్నాయి. వాటివల్ల ఎక్కడకు వెళ్ళాలంటే అక్కడికి, ఎప్పుడు కావాలంటే అప్పుడు వెళ్ళగలను. నడిచి వెళితే ప్రపంచం మొత్తం చూడలేనుకదా!" అన్నాడు.

శేఖరుడు అతనివద్ద మరికొన్ని విషయాలు తెలుసుకుని కృతజ్ఞతలు చెప్పి ముందుకు వెళ్ళిపోయాడు!

* * * *

శేఖరుడు హిమగిరి రాజ్యాన్ని చేరుకోవాలంటే మధ్యలో అనేక అడవులు, కొండలు, నదులు దాటాలి. ఎన్నో గ్రామాలు మీదుగా ప్రయాణం చేయాలి. శేఖరుడు ఇవన్నీ దాటుకుంటూ ముందుకుపోతున్నాడు.

అలా పది రోజులు ప్రయాణం చేసేసరికి హిమగిరి రాజ్యాన్ని చేరుకున్నాడు. అక్కడనుండి మణిపురికి దారి అడుగుతూ ముందుకి వెళ్ళసాగాడు. అది గమనించి ఒక ముదుసలి ఇలా అడిగాడు శేఖరుణ్ణి. "ఏం బాబూ! నువ్వు వరుణాచలం వెళ్ళవలసినవాడివా?"

శేఖరుడు ఆశ్చర్యపోతూ "అవును. కానీ ఆ విషయం మీకెలా తెలుసు?" అని ప్రశ్నించాడు.

ఆ ముదుసలి నవ్వుతూ "ఎందరో వచ్చి ఇక్కడ నీలాగే దారి అడుగుతుంటారు. ఇక్కడకు వచ్చి దారి అడిగే వాళ్ళంతా వరుణాచలం వెళ్ళవలసినవాళ్ళే! కొత్తవాళ్ళు మాత్రమే అడుగుతుంటారు. అలాగే నీవు కొత్తవాడివి కనుక ఊహించాను" అని చెబుతూ "మళ్ళీ రాగలననే అనుకుంటున్నావా?" అని ప్రశ్నించాడు.

శేఖరుడు ఉలిక్కిపడి "వరుణాచలంకి వెళ్ళి రావడమంటే ప్రాణాలు పోయే పరిస్థితులు ఎదురగుతాయా?" అని ప్రశ్నించాడు. తనకు బౌద్ధ భిక్షువు ఈ విషయాలేవీ చెప్పలేదు. తనని భయపెట్టడం ఇష్టంలేక మానివేశాడా? లేక

నారంశెట్టి ఉమామహేశ్వరరావు



Scanned with CamScanner

మహిమలు కలవాడు కనుక అతనికి విపత్కర పరిస్థితులు ఎదురవ్వలేదా?

శేఖరుడి ఆలోచనలకు భంగం కల్గిస్తూ ఆ ముదుసలి "నీవు మూడు రోజులు కాలినడకన ప్రయాణించాలని తెలుసా? ఆ ప్రదేశంలో భయంకరమైన ఏడు తలల సర్పం ఒకటి సంచరిస్తోంది! అది అటువైపు వెళ్ళిన వారినందరినీ కాటు వేసి చంపుతోంది. అందుకే నిన్ను హెచ్చరిస్తున్నాను" అంటూ మరికొన్ని వివరాలు చెప్పాడు.

శేఖరుడు ఆ ముదుసలికి కృతజ్ఞతలు చెప్పి మణిపురికి బయల్దేరాడు. మణిపురి చేరేసరికి రాత్రి అయింది. ఆ రాత్రి ఒక సత్రంలో బస చేశాడు.

శేఖరుడి అదృష్టమేమోగానీ అక్కడో సంఘటన జరిగింది. శేఖరుడికి ప్రక్క గదిలో నుండి ఏవో మాటలు విన్పించసాగాయి. శేఖరుడు శ్రద్ధగా విన్నాడు.

అక్కడ రెండు గొంతులు మాట్లాడుకుంటు న్నాయి. వారి వద్ద అదృశ్యరూపం పొందే భరిణె ఉంది. అది తను కష్టపడి సాధించాడు కనుక తనకు చెందాలని ఒకడు అంటుంటే, అది సంపాదించడంలో తను చాలా సాయపడ్డాడు కనుక అది తనకు చెందాలని రెండవవాడు అంటున్నాడు.

అది తనకు లభిస్తే చాలా లాభం ఉంటుం



దనుకున్నాడు శేఖరుడు. ఆ గదికి వెళ్ళి వారిని ఒప్పించి తీసుకోవాలనుకుని అడుగు ముందుకు వేసేనరికి కొంచెం పెద్దగా మాటలు వినిపించసాగాయి. వారిద్దరూ నోరు చేసుకుంటున్నారు. చివరికి మాటా మాటా పెరిగి కత్తులతో పొడుచుకున్నట్టుగా ఊహించాడు శేఖరుడు.

అందరూ చేరకమునుపే ఆ భరిణెను చేజిక్కించుకోవాలనుకున్నాడు శేఖరుడు. వెంటనే వెళ్ళి దానిని తీసుకొని వచ్చేశాడు. వారిద్దరూ ఒకరినొకరు పొడుచుకున్న దృశ్యం చాలా భయంకరంగా ఉంది. అయినా అక్కడ నిలవలేదు. వెంటనే వెళ్ళి సత్రం యజమానికి ఫిర్యాదు చేసి వచ్చాడు.

ఆ మరునాడు ఉదయం వరుణాచలంకి ప్రయాణమై వెళుతూ తన గుఱ్ఱం సత్రం

యజమానికి అప్పగించాడు. వింత జలం కోసం ఓ పాత్ర తీసుకుని బయల్దేరాడు.

శ్వేతకొండలు పేరుకు తగ్గట్టుగా తెల్లగా ఎత్తుగా మంచుకొండల్లా కన్పిస్తున్నాయి దూరం నుంచే! శేఖరుడు వాటిని దాటుకుంటూ ముందుకు పోతున్నాడు. శ్వేతకొండలు దాటగానే భయంకరమైన అడవి ప్రారంభమయింది. అంతా కాలి నడకనే ప్రయాణం! వింతగా ఉంది శేఖరుడికి!

శేఖరుడు భయంకరమైన ఏడు తలల సర్పం కన్పిస్తుందేమోనని చూశాడు. మొదటిరోజు కన్పించలేదు. రెండవరోజంతా చూశాడు. ఆ వేళ కూడా కనిపించలేదు. ఆ ముదునలి తననీ ప్రయత్నం నుండి విరమింపజేయడానికే అలా చెప్పాడేమోనని అనుమానించాడు శేఖరుడు. కాని అతడి అనుమానం నిజం కాదు.

మూడవరోజు ప్రయాణం చేస్తున్నాడు. మధ్యాహ్న సమయమయ్యేసరికి ఏడుతలల సర్పం కన్పించింది. అది తనని చూడగానే భయంకరంగా బుసలుకక్కుతూ రాసాగింది. శేఖరుడు ఆలస్యం చేయకుండా ఆ భరిణె తీసుకుని కళ్ళకద్దుకున్నాడు.

శేఖరుడు అలా తాకించిన మరుక్షణం అతనికి అదృశ్యరూపం వచ్చింది. కోపంతో వచ్చిన సర్పం అక్కడ మనిషి లేకపోయేసరికి ఓ చెట్టును కసిగా కాటేసింది. ఆ పాముకాటుకు ఆ వృక్షం నీలి రంగులోకి మారి కూలిపోయింది.

దాన్ని చూడగానే శేఖరుడికి ఓ ఆలోచన వచ్చింది. ఇలాంటి భయంకర సర్పంవల్ల ఎందరో ప్రాణాలు కోల్పోతుండవచ్చు! అలాంటి దీన్ని చంపేసి లోకోపకారం చేస్తే? అలా అనుకున్న మరుక్షణం ఖడ్గాన్ని బయటకుతీసి ఆ సర్పం తలను ఖండించాడు. ఆ తల వెళ్ళి దూరంగా పడింది.

ఆ సర్పం కోపానికి అంతులేదు. ఆ బాధ తాళలేకనో లేక కోపం ఆపలేకనో వెళ్ళి ఒక వృక్షాన్ని కాటు వేసింది. ఆ వృక్షానికి మొదటి వృక్షానికి పట్టిన గతే పట్టింది. ఇలా ఆరుతలలూ శేఖరుడు ఖండించాడు. ఆ సర్పం ఆరు వృక్షాలను నాశనం చేసింది.

శేఖరుడు ఏడవతల ఖండించాడు. అది క్రింద పడేలోగా ఓ వెలుగు వెలిగింది. ఒక దివ్యపురుషుడు ప్రత్యక్షమయ్యాడు. ఆ హఠాత్పరిణామానికి శేఖరుడు ఆశ్చర్యపోయి నిలబడుతున్నంతలో ఆ వ్యక్తి ఇలా మాట్లాడాడు.

"నాయనా! అదృశ్యరూపం వీడి నీ అసలు రూపంతో కన్పించు" అన్నాడు.

శేఖరుడు మామూలు రూపంతో కన్పించాడు. అప్పుడా వ్యక్తి "బాబూ! నేనెవరు? ఈ సర్పంను సంహరిస్తే నేను రావడమేమిటి? అని ఆశ్చర్య పోతున్నావా? నీవు అదృశ్యరూపంలో ఉన్నట్టు



Scanned with CamScanner



నాకెలా తెలుసునని అనుకుంటున్నావా? నా గురించి చెబుతాను విను. నేనొక గంధర్వుడను. నేను ఓ మునికి చేసిన అపకారం కారణంగా శాపం పొంది సర్పంగా మారాను. శాపవిమోచన కోరగా అదృశ్యరూపంలో ఉన్న వీరుడిచే నీ ఒక్కొక్క తల ఒక్కొక్క వ్రేటుకే ఖండించబడిన నాడు శాపవిమోచన కలుగుతుంది అన్నాడు. అదే విధంగా నీచే నాకు శాప విమోచన కలిగింది. కృతజ్ఞుణ్ణి! నీవు వరుణాచలం వెళ్ళి వింత జలం తేవాలనుకుంటున్నావు. అవునా?" అని ప్రశ్నించాడు ఆ గంధర్వుడు.

శేఖరుడు ఇంకా ఆశ్చర్యం నుంచి తేరుకోలేదు. నెమ్మదిగా అంతా అర్థమయ్యాక అసలు విషయం చెప్పాడు. శేఖరుడికి "అతను తీసుకెళ్ళే జలం ఎంత తీసినా తరగకుండా వరమిచ్చి, ఆ జలాన్ని నోటిలో పోయవద్దని" మరీ మరీ హెచ్చరించి గంధర్వుడు మాయ మయ్యాడు.

శేఖరుడు వరుణాచలం చేరుకున్నాడు. అక్కడ ఒక పెద్ద సరస్సువలె జలం నిండి వుంది. ఆ జలం ఎక్కడనుండి వస్తుందో తెలియదు. ఎటు వెళ్తుందో తెలియదు. ఆ జలం మీదకు ఎగచిమ్ముతూ క్రిందకు పడుతోంది. శేఖరుడు తను తెచ్చిన పాత్ర బయటకు తీసి

ఆ నీరు నింపబోయాడు. ఈలోగా అతనికి విపరీతమైన దాహం వేయసాగింది. నీరు త్రాగకపోతే చనిపోతామన్నంత తీవ్రంగా వేయడంతో ఆ నీరు నోటిలో పోసుకోబోయాడు. అంతలో చెళ్ళున కొట్టినట్టై క్రింద పడిపోయాడు. దోసిళ్ళలో నీరి క్రిందపడిపోయింది.

శేఖరుడు ఆశ్చర్యపోయి చూసేసరికి గంధర్వుడు కోపంగా తనవైపే చూస్తూ కన్పించాడు.

"నాకు శాపవిమోచన కల్పించావు కనుక నీ ప్రాణాలు కాపాడాను. ఈ నీరు త్రాగితే చనిపోతారు" అంటూ తన శక్తితో అతడికి దాహం తీర్చాడు.

శేఖరుడు జలం నింపుకుని తిరుగు ప్రయాణమయ్యాడు. అతడు తన రాజ్యం చేరేసరికి పరిస్థితి విషమించింది. అయినా శేఖరుడు 'వింతజలం' తీసుకురావడం మంచిదే అయింది.

అప్పటికప్పుడు ఆ జలాన్ని వివిధ పాత్రల్లోకి నింపి రాజ్యం మొత్తంమీద సరఫరా చేయించాడు. ఆ జలం ఎంత తీసినా తరగకపోవడంవల్ల రాజ్యం మొత్తానికి సరిపోయింది.

ఆ జల ప్రభావంవల్ల కళ్ళ వ్యాధి సమసిపోయింది. ఆ తరువాత ఓ శుభ ముహూర్తాన శేఖరుడి వివాహం విజయలక్ష్మితో జరిగింది. తరువాత చాలాకాలం రాజుగా పరిపాలించి ప్రజల మన్ననలు పొందాడు శేఖరుడు. ***(బాలరంజని, మార్చి 1988)***



# సమస్య

సింహపురి రాజు సింహబలుడు తన దేశంలోని పేదవారికి ఉచితంగా భోజన సదుపాయ ఏర్పాట్లు గావించాడు. మొదట్లో ఇది బాగానే జరిగేది. తరువాత సోమరిపోతులు చాలామంది పేదవారిమంటూ రాసాగారు. దాంతో జనం విపరీతంగా పెరిగిపోయి ఖజానా ఖాళీ అవసాగింది.

ఈ సమస్యకి పరిష్కారం ఏమిటో ఆలోచించమని రాజు మంత్రిని పిలిచి అడిగాడు.

మంత్రి ఆలోచించి ఒక ప్రకటన చేశాడు అది ఏమిటంటే –

"దేశంలో వున్న సోమరితనాన్ని తగ్గించడానికి త్వరలో పెద్ద యజ్ఞం చేయబోతున్నారు. బలిపశువుగా సోమరులనే



పంపిస్తారు. సిద్ధంగా వుండండి" అని.

అంతే! ఉచిత భోజనశాలలో జనం సంఖ్య తగ్గిపోయింది. ఇది జరిగాక కూడా కొంతమంది ప్రజలు వస్తుండడంతో వారే నిజమయిన పేదవారిగా గుర్తించాడు రాజు. అయితే వారు కూడా సోమరులు కాకుండా వారి కోసం పనులు అప్పగించి కష్టించి బ్రతకడం అలవాటు చేశాడు.

*(ఆంధ్రభూమి వారపత్రిక, 1987)*



Scanned with CamScanner



# వీడిన భయం

"అమ్మా! త్వరగా రావే! భయమేస్తోంది. భయంతో ప్రాణం పోతోంది" అన్న కిరణ్ కేకలు వంటగదిలో వంట చేస్తున్న సుమిత్ర చెవుల్లో పడ్డాయి.

ఎక్కడి వంట అక్కడే ఆపుచేసేసి గబగబా బయటకు వచ్చింది సుమిత్ర. కిరణ్ కేకలు బాత్‌రూమ్‌లో నుంచి వస్తున్నట్లు గ్రహించి గబగబా అటు అడుగులు వేసింది.

కిరణ్ ఆరో తరగతి చదువుతున్నాడు. చదువులో మంచి మార్కులు పొందుతుంటాడు. చలాకీ కుర్రవాడే కానీ అతడికి కొన్ని కీటకాలంటే భయం. బాత్‌రూమ్ రంధ్రాల్లోంచి అకస్మాత్తుగా బయటకు వచ్చే బొద్దింకలన్నా, గోడలపై నుంచి ఒక్కొక్కసారి నోటితో శబ్దాలు చేసే బల్లి అన్నా చెప్పలేనంత భయం. ఆ విషయం సుమిత్రకు తెలుసు. ఇప్పుడు కిరణ్ భయపడింది అందుకే అయితే ఫర్వాలేదు. ఒకవేళ అది కాకపోతే అన్నది ఆమె ఆత్రుతకు కారణం. త్వరగా బాత్‌రూమ్‌ను సమీపించి "ఏమైంది కిరణ్? ఎందుకంత కంగారుగా పిలుస్తున్నావు?" తలుపు తీస్తూ ప్రశ్నించింది సుమిత్ర.

బాత్‌రూమ్ లోపల భయం భయంగా ఏడుస్తూ, గంతులేస్తూ ఓ మూలకి చూపించాడు కిరణ్. అటువైపు చూసింది సుమిత్ర. అక్కడో ఎలుకపిల్ల చనిపోయి ఉంది. బహుశా దానిని తమ ఇంట్లో పెరిగే పిల్లి వేటాడి ఉంటుంది. దానికి కావలసిన ఆహారం కంటే ఎక్కువే దొరికి ఉండొచ్చు. అందుకే దీనిని చంపి తినకుండా విడిచిపెట్టేసింది.

"ఓస్ ఇంతేనా. దీనికే అంత భయపడి పిలిచావేం?" తేలిగ్గా తీసిపారేస్తూ అడిగింది సుమిత్ర.

తల్లిని రెండు చేతులతో చుట్టేస్తూ "నాకు కొన్నింటిని చూస్తే భయంవేస్తుందమ్మా. అందులో అది చనిపోయింది కదా, ఇంకా



నారంశెట్టి ఉమామహేశ్వరరావు

Scanned with CamScanner

ఎక్కువభయం వేసిందమ్మా" అన్నాడు కిరణ్.

కొడుకుని గుండెలకు హత్తుకుని "ఒక్క క్షణం నువు బయట నిలబడితే నేను దాన్ని తీసి పారేస్తాను. తర్వాత నువ్వు స్నానం చేద్దువుగానీ" చెప్పింది సుమిత్ర.

"మరి నీకు భయం వేయదా? అది నిన్నేమీ చెయ్యదా?" తల్లిని ప్రశ్నించాడు కిరణ్.

"భయం వెయ్యదు కన్నా, అదీ మనలాంటి ప్రాణేకదా. దాన్ని మనమేమైనా చేస్తామేమోనని అదీ భయపడుతుంది కదా. ఇప్పుడైతే చనిపోయి ఉంది కాబట్టి అసలా ఆలోచనే చెయ్యక్కరలేదు" సుమిత్ర కొడుకుని మాటల్లో పెట్టి ఎలుకను తోక దగ్గర పట్టుకొని తీసుకువెళ్ళి బయట దూరంగా విసిరేసి వచ్చింది.

అక్కడే ఒక చెట్టు మీద కావుకావుమంటూ అరుస్తున్న కాకి ఎగురుతూ వెళ్ళి ఆ ఎలుకను నోటితో పట్టుకొని ఎగిరిపోయింది.

ఇదంతా బయటికి వచ్చి చూసిన కిరణ్‌కి ఆశ్చర్యంగా, ఆనందంగా అనిపించి చప్పట్లు చరుస్తూ "మా అమ్మకు భయమేలేదు" అన్నాడు తల్లి బుగ్గమీద ముద్దుపెడుతూ.

"నీకు సాయంత్రం ఎక్కువసేపు కీటకాలు, జంతువుల గురించి చెబుతాను. నీకు స్కూలుకి టైమవుతోంది కానీ త్వరగా రెడీ అవ్వు." అని చెప్పి వంటగదిలోకి దూరింది సుమిత్ర.

సాయంత్రం కిరణ్ స్కూల్ నుంచి రాగానే అతడికి కొన్ని తెల్ల ప్లాస్టిక్ బాక్సులు టేబుల్‌మీద కనిపించాయి. వాటిల్లో ఒక్కొక్కదాంట్లో ఒక్కొక్క కీటకమో, జంతువో కనిపించాయి. అవిచూడగానే కిరణ్ ఎప్పటిలాగే భయంతో కేకలు పెట్టాడు.

సుమిత్రకు విషయం అర్థమైపోయింది. "భయపడకు కిరణ్. వస్తున్నా" అంటూ దగ్గరికివచ్చి "చూశావా! అవి కూడా ఎంతగా భయంతో విలవిల్లాడుతున్నాయో! అవి మనల్ని ఏమీ చేయవు. కావాలంటే చూడు ఆ బాక్సు తెరుస్తాను" అని బొద్దింక ఉన్న బాక్సు తెరిచి బొద్దింక మీసాల లాంటి వెంట్రుకలు పట్టుకుని ఎత్తి చూపించింది. తర్వాత బల్లిని తోక పట్టుకుని చూపించింది. అది కాసేపు గిలగిలలాడి తర్వాత గబగబా పాకి గోడ మూలన దాక్కుంది. తర్వాత కప్పను చేత్తో పట్టి చూపించింది.

ఇలా ఇంట్లో పెరిగే ఈగ, ఎలుక, కప్ప, బల్లి, బొద్దింక.. ఒక్కొక్క దాన్ని చేత్తోపట్టుకుని "చూడు కిరణ్! మనిషి భయపడాల్సింది విషజంతువులకి, సర్పాలకేకానీ ఇలాంటి చిన్న ప్రాణుల విషయంలో కాదు. మనలాగే వాటికీ ప్రాణ భయం ఉంటుంది. మనం వాటిని ఏమైనా చేస్తామేమోనని దాక్కుని ఉంటాయి. ఎప్పుడో తారసపడతాయి. నువ్వు పెద్దయ్యాక డాక్టరుచదువు చదవాలంటే ఇలాంటి కప్ప, బొద్దింకలాంటి ప్రాణుల్ని చేత్తో పట్టుకుని వాటిలోని అవయవాలు గుర్తించాల్సి ఉంటుంది. అందువల్ల 'భయం' మాని తెగువ, ధైర్యం పెంచుకో" అంది సుమిత్ర.

అంతే, ఆరోజు నుంచి కిరణ్‌లో కీటకాలంటే ఉన్న భయం మాయమైంది.

***(వార్త దినపత్రిక, 5.1.2011)***



Scanned with CamScanner

# ఎంపిక

విశ్వమూర్తి అనే వ్యాపారికి వార్ధక్యం మీద పడడంతో తన ఆస్తుల నిర్వహణ, బట్టల వ్యాపారం తన ఇద్దరు కొడుకులు శివం, సుందరంలకు అప్పగించాలనుకున్నాడు. అయితే ఏ పని ఎవరికి అప్పగించాలో తేల్చుకోలేక పోయాడు. ఆ విషయంలో తన స్నేహితుడు శంకరయ్యను సలహా అడిగాడు. శంకరయ్య బాగా ఆలోచించి తనకు తోచిన ఓ మంచి సలహా చెప్పాడు.

ఆ ప్రకారం విశ్వమూర్తి తన కొడుకులను పిలిచి "మీ ఇద్దరికీ రెండు మొండి బాకీలు వసూలుచేసే బాధ్యతను అప్పగిస్తున్నాను. శివం... నువ్వు సీతానగరంలో వున్న కిష్టయ్య బాకీ వసూలు చెయ్యాలి. సుందరం... నువ్వు శ్రీపురంలో ఉన్న గోపయ్య బాకీ వసూలు చెయ్యాలి. మీరిద్దరూ రేపే వెళ్లిరండి" అని చెప్పాడు.

శివం, సుందరం పెందలాడే బయల్దేరి ఆ గ్రామాలకు వెళ్లి, మధ్యాహ్నం కల్లా తిరిగి వచ్చారు. పెద్ద వాడు శివం బాకీ డబ్బు వసూలుచేసుకు వచ్చాడు. చిన్నవాడు సుందరం ఒట్టి చేతులతో వచ్చాడు. తను వెళ్లేసరికి గోపయ్య మరో పని మీద పొరుగూరు వెళ్లాడని చెప్పాడు.

విశ్వమూర్తి వాళ్లని భోజనం చేసి రమ్మని చెప్పాడు. శివం, సుందరం భోజనం ముగించి రాగానే మళ్లీ వాళ్లకి వేరే పని పురమాయించాడు విశ్వమూర్తి. "మన ఊరిలో త్వరలో గ్రామదేవత పండుగ జరుపబోతున్నారు. మన బట్టల దుకాణంలోనే అందరినీ కొనమని గ్రామంలోకి వెళ్లి ప్రచారం చేసి రండి" అని చెప్పాడు.

పెద్దవాడు శివం కాసేపు నడుం వాల్చి తర్వాత వెళతానన్నాడు. సుందరం వెంటనే గ్రామంలోకి బయల్దేరి గ్రామ పెద్దలను, ముఖ్యమైన ఖాతాదారులను కలుసు కున్నాడు.

ఇంతలో విశ్వమూర్తి "నా కెందుకో





నారంశెట్టి ఉమామహేశ్వరరావు

Scanned with CamScanner

గుండెల్లో నొప్పిగా అనిపిస్తోంది" అన్నాడు. ఆ సమయానికి ఇంట్లోనే వున్న శివం పనివాళ్లని పిలిచి వైద్యునికి కబురుపంపాడు. వైద్యుడు గ్రామాంతరం వెళ్లాడని తిరిగి కబురు వచ్చింది. "అయితే పొరుగూరు వెళ్లి వైద్యుణ్ణి తీసుకురండి" అని పనివాళ్లను శివం పురమాయిస్తుండగా సుందరం గ్రామంలో ప్రచారం ముగించి ఇంట్లోకి అడుగుపెట్టాడు. విషయం తెలుసుకున్న సుందరం స్వయంగా పొరుగూరికి ప్రయాణమై వైద్యుణ్ణి వెంటబెట్టుకుని తీసుకొచ్చాడు.

వైద్యుణ్ణి చూస్తూనే విశ్వమూర్తి లేచి కూర్చుని "నా నొప్పి తగ్గిపోయింది. నా సమస్యకు పరిష్కారం దొరికింది" అన్నాడు సంతోషంగా.

అక్కడ ఉన్న అందరూ అతనివైపు ఆశ్చర్యంగా చూశారు. అదే సమయానికి అక్కడకు చేరిన విశ్వమూర్తి స్నేహితుడు శంకరయ్య "మీ నాన్నకి గుండెల్లో నొప్పి రావడం కేవలం నాటకం మాత్రమే! తన ఆస్తుల నిర్వహణ, బట్టల వ్యాపారాలను మీలో ఎవరికి దేన్ని అప్పగించాలో తేల్చుకోడానికే ఈ రోజు మీకు మూడు పరీక్షలు పెట్టాడు. దాని ప్రకారం ఆస్తుల నిర్వహణ బాధ్యతను పెద్దవాడైన శివంకి, బట్టల వ్యాపారం చిన్నవాడైన సుందరంకి ఇవ్వొచ్చని తేలిపోవడంతో సమస్య పరిష్కారమైంది" అన్నాడు.

దానికి శివం కోపంగా "మీ నిర్ణయం తప్పు అనిపించడంలేదా? బట్టల దుకాణానికి సంబంధించిన మొండి బాకీ వసూలుకి వెళ్ళి ఖాళీ చేతులతో తిరిగొచ్చిన సుందరానికి బట్టల వ్యాపారం అప్పగిస్తారా?" అన్నాడు.

అప్పుడు విశ్వమూర్తి కలగజేసుకుని "నా మిత్రుడి సలహాతో నేను మీకీ పరీక్షలు పెట్టాను. మీలో ఏమాత్రం ఓపిక, సహనం వున్నాయో మాకిప్పుడే తెలిసింది. ఆ విషయంలో ఓపిక, సహనం వహించడంలో శివం కంటే సుందరం ముందున్నాడు. శ్రీపురంలో గోవయ్య లేకపోవడం సుందరం తప్పు కాదుకదా! గ్రామంలో ప్రచారానికి వెళ్లమంటే నువ్వేమో కాసేపు విశ్రాంతి తీసుకుని వెళతానన్నావు. అలాగే నాకు గుండెల్లో నొప్పి అనగానే వైద్యుణ్ణి పిలిపించడానికి పనివాళ్లని పురమాయించావు. కానీ సుందరం అలా చేయలేదంటే చాలా సహనం, ఓపిక వున్నవాడని అర్థమైంది. ఇక బట్టల దుకాణానికి వచ్చే జనం అన్నిరకాల బట్టలూ చూస్తారు. అన్నీ చూసి కూడ నచ్చలేదని వెళ్ళిపోతుంటారు.అయినాసరే వారి మీద మనం విసుగు, కోపం ప్రదర్శించకుండా నవ్వుతూనే వ్యాపారం చేయాల్సి వుంటుంది. వ్యాపారస్తుడి లక్షణం అది. అందుకే సుందరాన్ని ఆ పనికి ఎంపిక చేశాం. ఇక నీ గురించి చెప్పాలంటే, వివిధ పనుల మీద పనివాళ్లని పురమాయించి పని చేయించడం నీకు బాగా తెలుసు. అందుకే ఆస్తుల నిర్వహణ నీకు అప్పజెబుతున్నాం" అని ముగించాడు.

తండ్రి జవాబుతో శివం, సుందరం సంతృప్తి చెందారు. ఎవరి బాధ్యతలు వారికి అప్పగించే సరికి గుండెల్లోంచి భారం దిగిపోయినట్టు సంతోషించాడు విశ్వమూర్తి.

***(ఆంధ్రభూమి వారపత్రిక, 1.7.2010)***



Scanned with CamScanner

# కొంటెదెయ్యం



వెంకటాపురం గ్రామంలో వెంకయ్య అనే వ్యక్తి నివసించేవాడు. అతడు చాలా పేదవాడు. కాని తెలివైనవాడు. అతడు ప్రతిరోజు వేకువనే లేచి అడవికి వెళ్లి కట్టెలు కొట్టుకుని తెచ్చి అంగట్లో అమ్మేవాడు. అలా అమ్మగా వచ్చిన ధనంతో కుటుంబాన్ని పోషించేవాడు.

ఒకనాడు అతనికి అర్ధరాత్రిలో మెలుకువ వచ్చింది. ఎంతకూ నిద్రపట్టకపోయేసరికి వెళ్లి గొడ్డలి తీసుకుని అడవికి బయలుదేరాడు. అమావాస్య రాత్రులేమోగానీ చీకటివల్ల త్రోవ కన్పించడంలేదు. అతడికి అలవాటు కావడంవల్ల ముందుకి అవలీలగా వెళ్ళి పోతున్నాడు.

అతడు అడవిలో ప్రవేశించి ఓ చెట్టుకొట్టబోయేంతలో ఓ పిల్లదెయ్యం వచ్చి అక్కడ ఆగింది. అలికిడి కావడంతో అటు తిరిగిచూశాడు. ఏమీ కనబడలేదు. అయినా "ఎవరు నువ్వు?" అని అడిగాడు.

ఆ దెయ్యం కొంటెతనం గలది. అది వెంకయ్యను ఏడిపించాలను కుంది. అందువల్ల మనుష్యభాషలో అదికూడా "ఎవరు నువ్వు?" అని ప్రశ్నించింది.

వెంకయ్య ఆశ్చర్యపోయి "నేను కర్రలు కొట్టేవాడ్ని!" అన్నాడు. దెయ్యం కూడా అదే సమాధానం చెప్పింది.

వెంకయ్య సంతోషంగా "మరింకేం? ఇద్దరం ఒకరికొకరు తోడు దొరికాం! వేగంగా కర్రలు కొట్టు! తెల్లవారుతూనే ఇంటికిపోదాం!" అన్నాడు. దెయ్యం అవే మాటలు అలాగే పలికింది.

వెంకయ్య తన మాటలకు అవే మాటలు మళ్లీ అటునుంచి జవాబుగా రావడం కోపం తెప్పించింది. "నేనేదంటే అదే పలుకుతున్నావు, మాటలు రావా? లేక తలబిరుసా" అని అడిగాడు కోపంగా. ఆ పిల్ల దెయ్యం తన ధోరణి మార్చుకోక తిరిగి అలాగే సమాధానం చెప్పింది.

వెంకయ్యకు ఈసారి గొప్ప కోపం



నారంశెట్టి ఉమామహేశ్వరరావు

వచ్చింది. తను కొట్టిన ఓ చెక్క అటువైపు విసిరాడు! అంతే దెయ్యం ప్రక్కకు తప్పుకుని అలాంటివే మరికొన్ని సృష్టించి అతనిపైకి విసరసాగింది. వెంకయ్యకు అప్పుడు అర్థమయ్యింది అది దెయ్యం పని అని! వెంటనే చెట్టుచాటున దాక్కుని వాటి నుండి తప్పించుకున్నాడు.

అతడికి అంతలో మెరుపులాంటి ఆలోచన వచ్చింది. వెంటనే తన మొలలో దాచిన డబ్బుసంచి తీసి దానివైపు కొడుతున్నట్లుగా విసిరాడు. దెయ్యం వెంకయ్య ఏంచేస్తే అంతకు అధికంగా బదులివ్వాలని నిర్ణయించుకోవడంతో కొన్ని డబ్బు సంచులు అలాంటివే సృష్టించి అతడిపైకి విసిరింది.


వెంకయ్య ఇలాగే తెల్లవార్లూ చేసి, అది పోగానే తెల్లవారుతూనే డబ్బు ఏరుకుని, దెయ్యం విసిరిన చెక్కలు మోపుకట్టుకుని ఇంటికి సంతోషంగా చేరాడు.

***(జాబిల్లి మాసపత్రిక, జూన్ 1986)***





Scanned with CamScanner



# రెండు ప్రశ్నలు

పూర్వము చందన రాజ్యాన్ని చందనుడు అనే రాజు పరిపాలించేవాడు. అతడు మంచి వాడు. తీరిక సమయాల్లో, పండిత గోష్ఠులు, సాహిత్య చర్చలు జరిపేవాడు. అతనికి బుద్ధిపుడితే సభలో కూడా ప్రశ్నలు వేసి సభికులను జవాబు చెప్పమనేవాడు. సరైన జవాబు చెబితే మంచి బహుమతి ఇచ్చి గౌరవించేవాడు.

ఒకరోజు చందనుడు సభలో ఇలా అన్నాడు. "సభికులారా! ఈ రోజు రెండు ప్రశ్నలు అడుగుతాను. సరిగ్గా సమాధానం చెప్పండి. మనం ఎవరిని అధికంగా ప్రేమించాలి? అందరికంటే గొప్పవాడెవరు?" ఇవీ ప్రశ్నలు!

సభికులు ఒక్కొక్కరే లేచి సమాధానం చెప్పగాసారు. రామం అనే సభికుడు లేచి "రాజా! మనం మాతృభూమిని అధికంగా ప్రేమించాలి. పుట్టినప్పటి నుండి చనిపోయేంత వరకు మనలని మోస్తుందికనుక! అలాగే ఈ లోకంలో అందరికంటే గొప్పవాడు భగవంతుడు. భగవంతుణ్ణి మించినవారూ, అంతటి సమర్థులు మరెవరూ లేరు" అన్నాడు.

రాజు అది సరైనది కాదని చెబుతూ "మనుషుల్లో గొప్పవారెవరో" చెప్పమన్నాడు.

ఈసారి వెంకటేశుడు అనే సభికుడు లేచి "రాజా! మనం అధికంగా ప్రేమించాల్సింది భార్యని! కన్నవాళ్ళను వదలి జీవితాంతం ఒక పురుషుడితోనే గడిపి, సేవ చేసి తరించా



నారంశెట్టి ఉమామహేశ్వరరావు

లనుకునే భార్యను కాక మరెవరిని ప్రేమించినా ద్రోహమే అవుతుంది. ఇకపోతే అందరికంటే గొప్పవాడు రాజు. భూలోకంలో అంతటి బల వంతుడు ధనవంతుడు మరొకడు ఉండరు కదా!" అన్నాడు. అది కూడా సరైనది కాద న్నాడు రాజు చందనుడు.

ఆ తర్వాత చాలామంది లేచి ధన ధాన్యాలను, స్నేహితులను ప్రేమించాలని, భాగ్యవంతుడు గొప్పవాడని చెప్పారు. కానీ చందనుడు వాటిని మెచ్చుకోలేదు.

చివరిగా భూషణుడు అనే ఓ సభికుడు లేచి "రాజా! మనం అధికంగా ప్రేమించా ల్సింది కన్నతల్లిని. మనను నవమాసాలు మోసి కని, పెంచి పెద్దచేసి లోకం తీరు నేర్పే తల్లిని ప్రేమించక మరెవరని ప్రేమించినా అది ద్రోహమే అవుతుంది. తల్లి జన్మనిచ్చేందుకు తన ప్రాణాలు పణంగా పెడుతుందికదా! అలాంటి మాతృమూర్తిని ప్రేమించాకనే మిగతావారిని ప్రేమించాలి.

ఇకపోతే ఈ లోకంలో అందరికంటే గొప్ప వాడు గురువు. భగవంతుడి స్వరూపం ఇలా ఉంటుంది అని చెబితేగాని మనం తెలుసుకో లేం! అలాంటి భగవంతుడి గూర్చి చెప్పాలన్నా, రాజు అయ్యేందుకు ఉత్తమ లక్ష ణాలు నేర్పా లన్నా, ధనవంతుడు అయ్యేందుకు తెలివితేటలు కావాలన్నా ఇవన్నీ ఒక్క గురువు వల్ల మాత్రమే సాధ్యం! అందువల్ల అతనే గొప్పవాడు" అన్నాడు.

అంతే! సభికులు చప్పట్లు చరిచారు. రాజు చందనుడు ఆ సమాధానం చెప్పిన భూషణుడికి బహుమతి ఇచ్చాడు. *(ఉదయం వారపత్రిక, 23 మార్చి 1990)*



# జ్ఞానోదయం

తీర్థయాత్రలు చేసి తరిద్దామని బయల్దేరాం మేమ్ముగ్గురమూ. నేను ఉపాధ్యాయునిగా పనిచేస్తూ రిటైర్‌మెంట్ పొందేందుకు దగ్గర పడ్డాను. మరొకరు రామిశెట్టి అనే వ్యాపారి. మూడవవాడు వెంకటనాయుడు అనే రైతు. నేను ఆ గ్రామంలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నప్పుడే వారు పరిచయం అయ్యారు. ఆ తర్వాత మేము ముగ్గురం మంచి స్నేహితులమయ్యాం.

దురదృష్టవశాత్తూ ట్రెయిన్‌లో మా సూట్‌కేస్‌లు పోగొట్టుకుని కట్టుబట్టలతో మిగిలాం. జేబులో చిల్లర పైసలు తప్ప మరేం మిగలలేదు. మా పరిస్థితి ఘోరంగా ఉంది. ముగ్గురి సూట్‌కేసులు ఒకేసారి పోవడం విచిత్రం అన్పించింది.

ఎలాగో ఒకటి రెండురోజులు గడిచిపోయాయి. మూడవరోజుకి ఆకలి అధికం అయ్యింది. మేము అప్పటికే ట్రైన్ దిగి తమిళనాడులోని ఓ పుణ్యక్షేత్రంలో ఉన్నాం.

మేము దారిలో నడవలేక నడుస్తూ, ఆకలితో స్పృహతప్పి పడిపోయే స్థితిలో ఉండటంచూసి, ఎవరో మహానుభావుడు హొటల్ నుండి ఓ పాకెట్ భోజనం తెచ్చి అందించాడు. దాన్ని చూడగానే మాకు ప్రాణం లేచి వచ్చింది.

ఆ ఆహారం సమంగా సర్దుకుని తినబోతుండగా వెంకటనాయుడు "మనం మన వృత్తుల గొప్పతనాన్ని బట్టి ఈ ఆహారం పంచుకుందాం. ఆపద సమయంలో దొరికిన ఆహారం కనుక ఎంతో విలువైనది. ఏమంటారు?" అన్నాడు.

నాకు అతణ్ణి చూస్తే అంత బాధలోనూ నవ్వొచ్చింది. ఆ మాటలు అన్నది అతడు కాదు





నేరంశెట్టి ఉమామహేశ్వరరావు

అతనిలో ఆకలి అలా అన్పించింది.

అతడి ఉద్దేశం గ్రహించాను. అతడు రైతుబిడ్డ కదా! రైతు వ్యవసాయం చేసి కష్టించి పండించబట్టే ఈ దేశానికి ఆహార ధాన్యాలు సమకూరుతున్నాయి. కాబట్టి అతడికి ఈ ఆహారంలో అధికవాటా కావాలని అంటాడు. కొద్దిసేపు ఆలోచించాను. తర్వాత "మనలో ఎవరు గొప్ప అని ఆలోచించకుండా ఆహారం పంచుకుని తినవలసింది. వెంకటనాయుడు అలా అనబట్టి నేను ఒక కథ చెప్తాను. అది విని మీకు ఎలా నచ్చితే అలా చేయండి" అన్నాను. 'సరే' అన్నారు ఇద్దరూ!

కథ మొదలుపెట్టాను.

ఒకప్పుడు మంచి ధనవంతుడు ఉండేవాడు. అతడికి ముగ్గురు కొడుకులు. ధనవంతుడికి అంత్యకాలం సమీపించింది.

ధనవంతుడు తన కుమారులను ఒక్కొక్కరిని పిలిచి రహస్యంగా "నేను నా ఆస్తిని నాలుగు వాటాలు వేయిస్తాను. నీవు నా వ్యవహారాలన్నీ సక్రమంగా నిర్వర్తిస్తే నేను నీకో ఉంగరం ఇస్తాను. ఈ ఉంగరం ఎవరివద్ద ఉంటే వారికి అదనంగా మరోవాటా వస్తుంది. అలా నేను వీలునామా రాసి చనిపోతాను" అని చెప్పాడు.

తండ్రి సూచన ప్రకారం ముగ్గురూ జాగ్రత్తగా తమ విధులు నిర్వర్తిస్తూ అదనపు వాటా సంపాదించాలని ప్రయత్నించారు. చివరకు ధనవంతుడు మరణించాడు.

అతని అంత్యక్రియల అనంతరం పెద్దల సమక్షంలో వీలునామా తెరిపించారు. ముగ్గురు కుమారులూ ఒక్కొక్క ఉంగరం తెచ్చి చూపుతూ తనకు అదనపు వాటా వస్తుందని అడిగారు. ఇదెలా సాధ్యం?

ఒక్కరు ఉంగరం తెస్తే అదనపు వాటా ఇవ్వగలరు. ముగ్గురూ ఒకేలాంటి ఉంగరాలను తెచ్చినపుడు ఎలా ఇవ్వగలరు?

అందరికీ న్యాయం చేయాలనే ఉద్దేశ్యంతోనే వారి తండ్రి అలాచేసి ఉంటాడని పెద్దలు గ్రహించారు. ఆస్తి ముగ్గురికీ సమంగా పంచారు.

కన్నతండ్రికి కావలసింది పిల్లల బాగోగులే కదా! వారికి వారి పనులు యందు శ్రద్ధ కల్గించ డానికే అలా చేశాడు.

అదీ కథ! అలాగే ఆకలి అనేది మనుషుల వృత్తులను బట్టికాక మనుషులను బట్టి ఉంటుంది. కనుక వృత్తుల జోలికి పోయి ఎవరు గొప్పో తేల్చుకోవద్దు" అని ముగించాను.

తన తొందరపాటుకి మన్నించమని వెంకటనాయుడు కోరాడు.

నేను సంతోషంతో ఆహారం కోసం చూస్తే ఏదీ? నేను కథ చెప్పడంలో నిమగ్నమయి నప్పుడు ఒడుపుగా ఒక కుక్క దానిని లాగుకు పోయి తినేసింది.

మావాళ్ళకి జ్ఞానోదయం కల్గించగలిగాను కానీ, కడుపునింపలేకపోయాను. ఎందుకంటే ఉపాధ్యాయుణ్ణికదా!

*(ఉదయం వారపత్రిక, 23 మార్చి 1990)*



# పిసినారి దానం

పార్వతీపురం గ్రామంలో లక్ష్మీపతి అనే వైశ్యుడు ఉండేవాడు. అతడు పరమ పిసినారి. తన చేత్తో దానం చేసి ఎరుగడు. ఆ ఇంటికి వెళ్ళి ధర్మం పొంది తిరిగి వచ్చిన భిక్షగాళ్ళు ఎవరూ లేరు. లక్ష్మీపతి పిసినారితనం గురించి చుట్టుపక్కల ఊళ్ళలో కూడా వ్యాపించింది. లక్ష్మీపతి ఉంటున్న ఊళ్ళోనే చంద్రం, సుందరం అనే యువకులు ఉంటున్నారు. వారు నాటకాలు వేస్తుంటారు. మంచి స్నేహితులు.

ఒకసారి ఎందుకో వారిద్దరి మాటల మధ్యా లక్ష్మీపతి దొర్లాడు. అప్పుడు వాళ్ళు "మనం నటులం కదా! మన నటనను రంగస్థలంపైన అందరూ మెచ్చుకోవడం గొప్ప కాదు. లక్ష్మీపతిలాంటి పిసినారి నుంచి కూడా ఏదైనా యాచన చేసి పొందే రోజునే మనం నటులం అనిపించుంటాం" అనుకున్నారు.

ముందుగా సుందరం చంద్రంతో "నీవు లక్ష్మీపతి ఇంటికి బిచ్చగాడి వేషంలో వెళ్ళి దానం పొంది రాగలవా?" అని అడిగాడు. దానికి చంద్రం "లక్ష్మీపతి నుంచి దానం పొందడమంటే చనిపోయిన మనిషిని బ్రతికించడమే అనుకోవాలి. అయినా నా ప్రయత్నం నేను చేస్తాను" అన్నాడు.

మరునాడు చంద్రం కుంటివాడి వేషం వేసుకున్నాడు. కుంటివాడిలా నడవడం కొంతసేపు అభ్యసించాడు. ఆ తరువాత లక్ష్మీపతి ఇంటికి వెళ్ళాడు.

లక్ష్మీపతిని ప్రశంసిస్తూ కొంతసేపు, తన కుంటితనాన్ని చూపుతూ దానం చేయమని కొంతసేపు యాచించాడు. అయినా ఫలితం

లేకపోయింది. మరింత దీనంగా యాచన చెయ్యాలనుకున్న చంద్రం ఆలోచన ఫలించ లేదు. ఎందుచేతనంటే లక్ష్మీపతి "పోవయ్యా! దుక్కలా ఉన్నావు. నీకు ధర్మం చెయ్యాలా? ఫో!" అనేసి తలుపులు బిగించేశాడు.

చంద్రం విసిగిపోయి అక్కడినుంచి వెళ్ళి సుందరాన్ని కలిశాడు.

"లక్ష్మీపతి నుంచి దానం పొందడం అంత సులభంకాదని ముందే చెప్పాను కదా! అలాగే అయింది" అన్నాడు చంద్రం.

సుందరం అందుకు అంగీకరించక – "నీవు బిచ్చగాడిలా బాగా నటించి ఉండవు. నేను ప్రయత్నం చేస్తే దానం పొంది రాగలనని పిస్తోంది" అన్నాడు.

ఆ మాటలకు చంద్రానికి బాగా కోపం వచ్చింది. "అది నీ వల్ల కాదు నువ్వు దానం పొంది వచ్చేవనే అయితే నీకు వంద రూపాయలు పందెం చెల్లిస్తాను. మరి నువ్వు దానం పొందలేకపోతే ఇవ్వగలవా?" అని అడిగాడు.

సుందరం నవ్వుతూ – "పందాలు ఎందుకు మన మధ్యన? ప్రయత్నించి చూడటంలో తప్పులేదుకదా!" అన్నాడు.

కాని చంద్రం వినలేదు. "సులువుగా మాటలు అనడం కాదు. చేసి చూపించాలి" అన్నాడు రెచ్చగొడుతూ.

సుందరం "సరే! పందెం కాద్దాం. వంద రూపాయలే కదా!" అన్నాడు.

మరునాడు లక్ష్మీపతి ఇంట్లో ఉండే సమయం చూసుకుని వెళ్ళాడు సుందరం. అతడు గుడ్డి బిచ్చగాడి రూపంలో వెళ్ళాడు. అతడిని సుందరం అని పోల్చడం కష్టం.

సుందరాన్ని దూరం నుంచి గమనించ సాగాడు చంద్రం.



సుందరం లక్ష్మీపతి ఇంటి ముందు నిలబడి దీనంగా – "బాబూ... ధర్మం! గుడ్డివాణ్ణి! కనిక రించండి..... ధర్మాత్ములు దయ చూపండి" అన్నాడు.

అతని మాటలకు ఎవ్వరూ బదులు పలక లేదు. ఈసారి సుందరం "కళ్ళు లేని కబోదిని, కనికరించండి..." అంటూ పిలిచాడు.

అలా పిలిచినా ఎవ్వరూ రాలేదు.

సుందరం విసిగిపోకుండా "గుడ్డివాడు దొడ్లో అరుస్తుంటే ఉసురు తగుల్తాది. ధర్మం చేసి పంపకపోతే పాపం చుట్టుకుంటాది" అన్నాడు.

అయినా లోపలి నుంచి జవాబులేదు. ఈసారి కాస్త గట్టిగా "నేను అలాంటిలాంటి బిచ్చగాణ్ణి కాను. రోజుకి ఒకే గడప ఎక్కుతాను. ఇచ్చినా, ఇవ్వకపోయినా ఇక్కడే ఉంటాను" అన్నాడు. అలా అనేసి ముందు మెట్లమీద కూర్చున్నాడు.

ఎంతకీ వదలడేమో అన్న భయంతో లక్ష్మీపతి బయటికి వచ్చి "ఆడవాళ్ళు లేరు. వెళ్ళిరా!" అన్నాడు.

సుందరం ఆ స్వరం విని వేగంగా వెళ్ళి, కాళ్ళు పట్టేసి, "దానంచేయందే కదలను బాబయ్యా! అది నా నియమం!" అన్నాడు పట్టు బిగిస్తూ.

లక్ష్మీపతికి దానం చేయాలని లేకపోయినా, పీడ విరగడ అవదనే భయంతో ఒక నాణెం తీసి సుందరం పాత్రలో శబ్దం వచ్చేలా వేశాడు.

ఆ శబ్దం విని పట్టు సడలించి అతణ్ణి పొగుడు కుంటూ వెళ్ళిపోయాడు సుందరం.

దూరం నుంచి చూసిన చంద్రానికి గుండెల్లో రాయిపడినట్లయింది. 'అనవసరంగా పందెం ఒడ్డి వంద రూపాయలు నష్టపోయాను' అను కున్నాడు.

సుందరం ఇంకా గుడ్డివాడిలాగే నడవడం చూసి, "ఇంక నటన చాలించు" అని చంద్రం అనే సరికి కళ్ళు తెరిచి లక్ష్మీపతి దానం చేసిన నాణెం వైపు చూసి కళ్ళు తేలేశాడు. సుందరం ఎందుకలా కళ్ళు తేలేశాడో అని చూసిన చంద్రం కూడా ఆశ్చర్యపోయాడు.

లక్ష్మీపతి దానం చేసింది చెల్లని నాణెం. సత్తునాణెం పడేసి గడుసుగా బిచ్చగాడి పీడ వదిలించుకున్నాడు పిసినారి లక్ష్మీపతి.

సుందరం, చంద్రం సందిగ్ధంలో పడ్డారు. వారిలో ఎవరు పందెం గెలిచారో తేల్చుకోవడం కష్టమైంది. చివరికి ఎవరూ పందెం గెలవలేదని నిర్ణయించారు. లక్ష్మీపతి నుంచి దానం పొంద లేకపోవడమూ, పొందినా చెల్లనిది పొందడమూ ఒకటేనని వారి ఉద్దేశం. అసలు లక్ష్మీపతి నుంచి పనికివచ్చేది ఏదైనా పొందాలని కదా వారి ఉద్దేశం! ఏది ఏమైనా సుందరం మంచి నటుడని చంద్రం ఒప్పుకున్నాడు.

ఆ తర్వాత నాటకాలలో 'పిసినారి దానం' గురించి హాస్యంగా చెప్పడం ప్రారంభించారు వాళ్ళు.

***(ఆంధ్రప్రభ వారపత్రిక, 6.2.91)***



Scanned with CamScanner



# మణిశేఖరుడు

చంద్రగిరి రాజ్యాన్ని భానుసింహుడు పరిపాలిస్తున్న కాలమది. భానుసింహుడు చాలా మంచివాడు. అతడి పేరు చెబితే శత్రువులు గడగడ వణికేవారు. అతడంటే శత్రువులకు సింహస్వప్నమేనన్నమాట. ప్రజానురంజకంగా పరిపాలించి కీర్తి, ప్రతిష్టలు ఆర్జించాడు భానుసింహుడు.

అటువంటిరాజ్యమైన భద్రగిరికి ఒకసారి ఉపద్రవమైన కరవు ఏర్పడింది. వానలు లేక పంటలు పోయాయి. తిండిలేక మనుషులు ఆకలి చావుల పాలవుతున్నారు. పశుగ్రాసాలు లేక పశువులు మలమల మాడి చనిపోసాగాయి. రాజ్యం మొత్తం మీద పూర్తిగా కరవు ఏర్పడటం వలన ఇదొక గొప్ప ప్రాణ సంకటంగా తయారయింది.

తక్షణ నివారణ కోసం ఇతర దేశాలనుండి తిండిగింజలు తెప్పించాడు భానుసింహుడు. కాని కొద్ది రోజులకే అవి అయిపోయాయి.

ఈసారి భారీ ఎత్తున పథకాలు వేసి సరకులను అధిక మొత్తాలమీద తెప్పించారు. రాజ్యం మొత్తం మీద కరవు ఏర్పడితే ఈ సరకులు ఒక లెక్కా? ఈ సరకులు మరి కొన్నాళ్ళకే అయిపోయాయి. కాని వానపడలేదు. పరిస్థితి మళ్ళీ మొదటికే వచ్చింది.

ఈ విధంగా కరవు ఏర్పడి, మరికొన్ని రోజులకే ఖజానా ఖాళీ అయిపోవడం జరిగింది. భానుసింహుడు కరవు నివారణకోసం గట్టిగా ప్రయత్నాలు చేశాడు. కాని ఫలించలేదు. కరవు

నారంశెట్టి ఉమామహేశ్వరరావు



Scanned with CamScanner

నివారణ విషయమై మంత్రులతో సమావేశం ఏర్పాటు చేశాడు. మంత్రులు కూడ తగిన పరిష్కార మార్గం చెప్పలేకపోయారు.

భద్రగిరి మహామంత్రి విద్యాధరుడు మాత్రం ఒక సూచనను ఆశాభావంగా వ్యక్తం చేశాడు. "రాజా! ఈ కరవు నుండి మనం గట్టెక్కాలంటే ఏదో మహత్తర శక్తి అడ్డుపడాలే తప్ప మానవ మాత్రుడు ఎవడూ ఏమీ చేయలేడు. అందు వలన ఒక పనిచేస్తే బాగుంటుంది. మన యువరాణి విజయలక్ష్మి అందచందాలకు పెట్టింది పేరు. కరవు నివారణ చేసేవారికి ఆమె నిచ్చి వివాహం చేయడమేగాక అర్ధరాజ్యాన్ని ఇస్తామని చాటింపు వేయిద్దాం. ఇది తెలిసిన మహాత్ముడెవరైనా వస్తే మన కష్టాలు గట్టెక్కు తాయి ప్రజాక్షేమం కోసం ఈ విధంగా చాటింపు వేయడం సమంజసమే కానీ అసమంజసం కాదు. ప్రజలు కరవుతో మలమల మాడి చనిపోవడం కంటే ఈ చాటింపువేసి... ప్రయ త్నించి.. రక్షించటం కంటే వేరే గత్యంతరం లేదు" అని వివరంగా చెప్పాడు.

మంత్రి మాటలకు మిగతా అధికారు లందరూ ఒప్పుకొన్నారు. భాను సింహుడు కూడా అందుకు సమ్మతించి ఆ మరునాడే దేశదేశా లలో చాటింపు వేయించాడు.

ఆ చాటింపు వేసిన మరునాటి నుండి దేశదేశాలనుండి ప్రముఖులెందరో వచ్చారు. కరవు నివారణ కోసం చాలామంది సలహాలు ఇచ్చారు. కాని అవేవీ ఆచరణ యోగ్యంగా లేవు. ఇందులో ఎక్కువమంది విజయలక్ష్మిని వివాహ మాడే ఉద్దేశంతో వచ్చినవారే!

ఇదిలా ఉండగా చాటింపు వేసిన పది హేనవ రోజుకు మాళవ రాజ్యాన్నుండి ఒక మహాముని వస్తున్నట్లు వార్త అందింది. ఆ మహాముని పేరు మణిశేఖరుడని, అతడెన్నో మహిమలు చూపించాడని తెలుసుకొన్న భాను సింహుడు, మంత్రులు కొంత ఊరట చెందారు. తమ కష్టాలు తీరేటట్లు చేయగలడని నమ్మారు. కాని అతడాపని చేస్తే రాజకుమారి విజయలక్ష్మి తో వివాహం జరపాలనే ఆలోచన మాత్రం వారికి రాలేదు.

ఆ ముని అరవయ్యేళ్ళ వయసులో ఉన్న ముదుసలిలా ఉన్నాడు. వెండిలా మెరుస్తున్నాయి తల, గడ్డం వెంట్రుకలు. చేతిలో కమండలం ఉంది. ఆ ముసలి ముని రావడంతోనే కరవు నివారణ చేయగలనని హామీ ఇచ్చాడు. మరి కొంత సేపయిన తర్వాత ఒక ఖాళీ బస్తా తెప్పించాడు. దాని చుట్టూ చేయి తిప్పుతూ ఏదో మంత్రం చదివాడు. ఆశ్చర్యం దానినిండా బియ్యం సాక్షాత్కరించాయి. వాటిని మరొక బస్తాలో నింపారు. కాని ఈ బస్తా నిండుగానే ఉంది. అలా కొన్ని వందల బస్తాలు నింపారు. అలాగే ఎన్నో రకాల తిండిగింజలని సాధువు తన మహిమలతో సృష్టించాడు.

ఆకలితో ఆవురావురుమంటున్న ప్రజలు వండేవరకు ఆగలేక బియ్యం తినేయసాగారు. రాజు అప్పటికప్పుడే ఆ సరకులను రాజ్యంలోని



Scanned with CamScanner

నలుమూలలకు పంపే ఏర్పాట్లు చేయించాడు. ఇదంతా బాగుంది. కాని మరొక సమస్య వచ్చింది. వారికి వండేందుకు నీరు లేదు. ఎకాఎకిన మునివద్దకు పరుగెత్తి ఈ విషయం చెప్పారు.

ఆ ముని ఆకాశంవైపు చూస్తూ చేయి తిప్పుతూ ఏదో మంత్రం చదివాడు. మరుక్షణం ఆకాశం నీలంగా మారింది. మేఘాలు పరుగులు తీసి వరదలై పారేలా వాన కురిసింది. దాంతో నీటి బాధకూడా తీరింది.

మణిశేఖరుడు మహిమలను అందరూ మెచ్చుకున్నారు. అతడికి నమస్కరించనివారు లేరు.

భానుసింహుడు మనసు మాత్రం మణిశేఖరుడికి తన కుమార్తెను ఇవ్వడానికి ఒప్పుకోవడం లేదు. మణిశేఖరుడు మరికొన్నాళ్ళ తరువాత ఆ విషయం కదపవచ్చునని వూరుకున్నాడు.

నాలుగైదు మాసములు గడిచేసరికి పంటలు బాగా పండాయి. ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారు. కరవు నివారణ జరిగిన సందర్భంగా ఆ ఏడాది ఘనంగా పండుగ జరుపాలని చాటింపు వేశాడు మహారాజు భానుసింహుడు. ఆ ఏడాది పండుగ ఘనంగా జరిపారు. చివరి రోజున ప్రజలందరి సమక్షంలో రాజు భానుసింహుడు సభ ఏర్పాటు చేశారు.

సరిగ్గా అదే సమయానికి సభకు మణిశేఖరుడు వచ్చాడు. అతడు రావడంతోనే ప్రజలందరూ కృతజ్ఞతగా నమస్కరించారు. మణిశేఖరుడు రాజు వేసిన చాటింపు గురించి,



విజయలక్ష్మితో తన వివాహం గురించి ప్రస్తావించాడు. ప్రజలందరూ అతనికి మద్దతు నిచ్చారు.

భానుసింహుడు ఆ సమయానికి ఎలాగో తప్పించుకోవాలనే ఉద్దేశంతో "అలాగేచేద్దాం! ప్రజలు ఇప్పుడిప్పుడే కరవునుండి నివారణ పొంది మామూలు స్థితికి వస్తున్నారు. మీ పెళ్ళి ఘనంగా జరిపించాలని నా ఉద్దేశం. మరి కొన్నాళ్ళాగితే జరిపిస్తాం" అన్నాడు. మణిశేఖరుడు అందుకు సమ్మతించాడు.

భానుసింహుడు, మంత్రి విద్యాధరుడిని తన రహస్య మందిరానికి పిలిపించి "మహామంత్రీ! మన యువరాణివంటి అందచందాలు గల స్త్రీని ఆ ముసలి మునికిచ్చి వివాహం జరిపించాలంటే నా మనసొప్పడం లేదు. దీని నుండి తప్పించే బాధ్యత మీది" అన్నాడు.

విద్యాధరుడు "మహారాజా! మీరు ఈ సమయంలో కాదంటే ఎలా అవుతుంది. మన ప్రజలను ఉపద్రవం నుండి కాపాడిన మునికి మనం అన్నట్లుగా చేయకపోతే మనకు చెడ్డ పేరు రాదా? అందునా మనం చాటింపు వేశాం. మాట తప్పకూడదు. పైగా అతడు మునీశ్వరుడు. మనపై కోపిస్తే మనం తట్టుకోగలమా?" అని సందేహాన్ని వెల్లడించాడు.

భానుసింహుడు కొద్దిసేపు ఆలోచించి మంత్రివర్యా! అతడు బ్రతికుంటే మనల్ని ఏమైనా చేయగలడు. అదే... చనిపోతే... మామూలుగా కాదు, ఏదైనా పథకం వేసి, గుట్టుగా చంపితే..." అని ఆగాడు.

మంత్రి విద్యాధరుడికి రాజు మాటలు నచ్చలేదు. 'ఆపద నుండి కాపాడిన మహాత్ముడికే అపకారం చేయడమా?' అని అనుకున్నాడు. రాజాజ్ఞ ధిక్కరించడం ఇష్టంలేక "ఇకనుంచి ఆ భారం నాపైన వేయండి. మీరు రేపు మణిశేఖరుడిని సభకు రప్పించాలి. గుట్టుగా, అతడి ప్రాణం అతడి చేత్తోనే తీసుకునేట్టు చేస్తాను" అని చెప్పి సెలవు తీసుకున్నాడు.

ఆ మరుసటి రోజు సభలో మణిశేఖరుడి నుద్దేశించి విద్యాధరుడు ఇలా అన్నాడు. "మహాత్మా! మీకు రాజకుమార్తెనిచ్చి వివాహం జరిపించాలని నిశ్చయించుకున్నాము. రాకుమార్తెను వివాహమాడే వానికి ధైర్యసాహసాలు, నేర్పుగా యుద్ధం చేసే గుణాలు ఉండాలి కదా. అలాగైతేనే భవిష్యత్తులో తన రాజ్యాన్ని పటిష్టం చేయగలడు. కనుక మీ విద్యలు పరీక్షించే నిమిత్తం చిన్న పని చేయాలి. అదేమంటే ఈ రాజ్యానికి ఉత్తర దిశలో ఉన్న చిన్న చిన్న గ్రామాలపై భయంకరమైన సింహం ఒకటి దాడిచేసి అపారమైన జనప్రాణ నష్టం కలిగిస్తున్నది. దానిని చంపిన వెంటనే మీ వివాహానికి సర్వం సిద్ధం చేయిస్తాను."

మణిశేఖరుడు ప్రజలందరి వైపు తిరిగి "దీనికి మీరే సాక్ష్యం. ఈపని నెరవేర్చుకొచ్చిన వెంటనే మా వివాహం జరుగుతుంది' అన్నాడు. అందరూ సమ్మతించారు. మణిశేఖరుడు



ప్రయాణమయ్యాడు. "సింహంతో కత్తివట్టి స్వయంగా యుద్ధం చేయాలి. అంతేగాని మంత్ర తంత్రాలతో చంపరాదు" అని చెప్పి కొందరిని తోడుగా పంపారు.

భానుసింహుడు లోలోపల సంతసించసాగాడు 'మణిశేఖరుడు ఈపాటికి ఏ స్వర్గాన్నో ఉంటాడు' అని అనుకున్నాడు. కాని ఆ సాయంత్రం అయ్యేసరికి మణిశేఖరుడు చచ్చిన సింహాన్ని తీసుకొని మరీ వచ్చాడు. ప్రత్యక్ష సాక్షులు అతనికి అనుకూలంగా సాక్ష్యమిచ్చారు. భానుసింహుడు ఇక తప్పించుకోడానికి కుదరలేదు. అయిష్టంగా ముహూర్తం నిర్ణయించాడు.

మణిశేఖరుడు విజయలక్ష్మి మెడలో తాళికట్టి, తన తలపై పండు వెంట్రుకలను, గడ్డాన్ని ఒక్కొక్కటి ఊడదీశాడు. అతడు ముసలి ముని కాదు. అతడు నవయౌనవంతుడైన యుక్త యువరాజు. మాళవరాజ్య రాకుమారుడు మణిశేఖరుడు. అందరూ ఆశ్చర్యం నుంచి తేరుకోవడానికి చాలాసేపు పట్టింది.

అప్పుడు మణిశేఖరుడు రాజునుద్దేశించి "రాజా! మీకు కరవు ఏర్పడిన కొద్దిరోజులలోనే నాకు నివారణ కలిగించాలనే ఉద్దేశం కలిగింది. కాని సామాన్యంగా పరిష్కరించ లేరని, మహాత్ములే దానిని ఆవగలరని చాలామంది అన్నారు. నేను దేశపర్యటన నెపంతో హిమాలయాల్లో ఉన్న సిద్ధీశ్వరముని వద్దకు వెళ్ళి 'మహామాయ సమన్వయసిద్ధి' అనే విద్య నేర్చుకున్నాను. దానితో ఇంకెన్నో మహత్తర కార్యాలు సాధించవచ్చు. అందువల్లనే ఈ పని చేయగలిగాను.

నేను ముసలి మునినని నాతో మీ కుమార్తె వివాహం చేయడానికి మీరు అంగీకరించలేదు. మరి అటువంటి ప్రకటనలు చేసి అమలుపర్చక పోవడం తప్పుకదా. మీకు ఈ విషయం తెలుపుదామని నేను ముసలి ముని వేషంలో వచ్చాను.... ఇంకా మీకు చింతగా ఉందా?" అన్నాడు.

"నాయనా! మణిశేఖరా! నీలాంటి వీరుడికి, విద్యాసంపత్తి కలిగిన ధీరునికి రాకుమార్తెను ఇవ్వడంకంటె మాకేం కావాలి! మాకెందుకు చింత" అక్షతలు వేస్తూ అన్నాడు భానుసింహుడు.

***(బాల మాసపత్రిక, జనవరి 1983)***



Scanned with CamScanner

# నిజమైన జోస్యం



కళ్యాణసింగుపురం అనే ఊర్లో భోజయ్య అనే జ్యోతిష్కుడు ఉండేవాడు. అతను పొట్ట కూటికోసం అప్పుడప్పుడు జోస్యం చెబుతూ ఉండేవాడు. కొంచెం తెలివైన వాడు కావడం వల్ల లౌక్యం ఉపయోగించి జోస్యం చెప్పేవాడు. అలా చెప్పిన సందర్భాల్లో దైవవశాత్తూ కొన్ని నిజమయ్యేవి. దాంతో అతనికి మంచి పేరొచ్చింది.

ఒకరోజు ఉదయాన్నే దీప్తిధరుడు అనే వైశ్యుడు భోజయ్యకు ఎదురై "నాకు ఈ రోజు ఎలా ఉంటుందో చెప్పండి!" అని చెయ్యి చూపాడు.

దానికి భోజయ్య క్షణకాలం తడుముకొని తప్పించుకునే మార్గం కోసం వెతికి చివరకు ఇలా చెప్పాడు,"ఈ రోజు మీ కేం హాని జరగదు. చెప్పుడు మాటలు వినకపోతే లాభిస్తుంది" అని.

దాంతో దీప్తిధనుడు పొంగిపోయి ఇంటికి వెళ్ళిపోయాడు.

కొంతసేపటికి విశాలగుప్తుడు అనే అతని వ్యాపార మిత్రుడు అక్కడికి వచ్చాడు. "మిత్రమా! పక్క గ్రామాల్లో దినుసులు పంటకొచ్చాయి. వాటిని కొని పార్వతీపురం పట్టణంలో అమ్మితే మంచి లాభాలు వస్తున్నాయట! నేను అక్కడికే బయలుదేరాను. మరి నీవూ వస్తావా?" అని ప్రశ్నించాడు.

దీప్తిధనుడికి భోజయ్య చెప్పింది గుర్తొచ్చింది. 'తను ఈ రోజు చెప్పుడు మాటలు వినకూడదు. వినకపోతే లాభిస్తుంది' అని మనసులో అనుకొని విశాలగుప్తుడు చెప్పిన మాటలు వినకూడదని తలచి "మిత్రమా! నాకు మన గ్రామంలోనే మరో పని తగిలింది. నేను రాలేను. నీవు వెళ్ళిరా!" అన్నాడు.



నారంశెట్టి ఉమామహేశ్వరరావు

Scanned with CamScanner

ఆ రోజు సాయంత్రం వరకు తనకు ఏదైనా లాభిస్తుందేమో అని ఎదురు చూశాడు దీప్తి ధనుడు. కాని అలాంటి దేమీ జరగలేదు.

మరికొంత సమయం గడిచాక విశాల గుప్తుడు తిరిగి వస్తూ కనిపించి "మిత్రమా! ఈ రోజు నేను వెళ్ళిన పని జయమైంది. వంద వరహాలు లాభించింది" అని చెప్పాడు.

అది వినగానే దీప్తిధనుడు ఎంతో బాధ పడ్డాడు. తను అనవసరంగా భోజయ్య జోస్యం నమ్మి చేజేతులా లాభం జారవిడుచు కున్నాడు. భోజయ్య వల్ల తను నష్టపోయాడు కనుక భోజయ్య మీద గ్రామాధికారికి ఫిర్యాదు చేయ దలిచాడు.

మరునాడు గ్రామాధికారిని కలిసి తనకు భోజయ్య చెప్పిన జోస్యం అబద్ధం అయిన విషయం చెప్పి, తనకు నష్టం కలిగించి నందుకుగాను ఆ నష్టపరిహారం అతని నుంచి ఇప్పించమని అడిగాడు.

గ్రామాధికారి భోజయ్యను పిలిచి ప్రశ్నిం చాడు. ముందు గాభరాపడి, తర్వాత తేరుకొని "అయ్యా! జోస్యం చెప్పడం వరకే కానీ, అది జరగకపోతే వాటి నష్టపరిహారం చెల్లించడం విషయం నే నెక్కడా వినలేదు" అన్నాడు.

"ఇలా ఒకసారి జరిగితే ఇకముందు బాధ్యతారహితంగా ఇష్టం వచ్చినట్లు జోస్యం చెప్పడం మానతారని ఇలా కోరాను" అన్నాడు దీప్తిధనుడు.

దానికి భోజయ్య "నే నేమని జోస్యం చెప్పాను?" అని ప్రశ్నించాడు.

గ్రామాధికారి కూడా దీప్తిధనుడిని చెప్పమని ఆజ్ఞాపించాడు.

దీప్తిధనుడు "నిన్నటిరోజు ఎలాంటి హానీ జరుగదనీ, చెప్పుడు మాటలు వినకపోతే లాభిస్తుందనీ చెప్పాడు భోజయ్య" అన్నాడు.

అప్పుడు భోజయ్య "నేను చెప్పింది యథార్థంగా జరిగింది" అన్నాడు.

"మీ జోస్యం తప్పయిపోయి నష్టం జరిగిందని నేను ఏడుస్తుంటే యథార్థంగా జరి గిందా? మీకు వేళాకోళంగా ఉందా భోజయ్య గారూ?" అన్నాడు కోపంగా దీప్తిధనుడు.

"ఇది ఎలా సాధ్యం?" అని ప్రశ్నించాడు గ్రామాధికారి.

"అయ్యా! అతనికి నిన్నటి రోజు ఏ హానీ జరగలేదు అన్నాను. అది నిజం కాబట్టే ఈ రోజు మన ముందు ఇలా మాట్లాడుతున్నాడు. ఇక రెండవది– చెప్పుడు మాటలు వినకపోతే లాభిస్తుంది అనడంలో ఒక్క విశాలగుప్తుడివే చెప్పుడు మాటలుగా భావించారు మీరంతా. కాని మరి నావి? నేను చెప్పిన మాటల్ని తోసిపుచ్చి వ్యాపారం చేసి ఉంటే లాభించేది కదా! కనుక నా జోస్యంలోతప్పులేదు. అది నిజమైంది. కనుక నేను ఎవరికీ ఏమీ ఇవ్వనక్కరలేదు." అనేసి అక్కణ్ణుంచి వెళ్ళి పోయాడు భోజయ్య.

***(ఆంధ్రప్రభ వారపత్రిక, 13.12.1989)***



Scanned with CamScanner

# అసలైన అర్హుడు!



విజయనగర మహామంత్రి చతురుడు వృద్ధుడై పోవడంతో ఆ పదవిని అర్హుడైన యువకుడితో భర్తీ చేయాలని మహారాజు మందహాసుడు నిర్ణయించాడు. ఆ బాధ్యతను మంత్రి మీదనే ఉంచాడు. మంత్రి రాజ్యమంతటా చాటింపు



నేరంశెట్టి ఉమామహేశ్వరరావు

Scanned with CamScanner

వేయించి తగిన విద్యార్హతలు ఉన్న యువకులను ఆహ్వానించాడు. వచ్చిన వారందరికీ రకరకాల పోటీలు నిర్వహించగా, చివరికి కరుణుడు, కనకుడు అనే ఇద్దరు సమఉజ్జీలుగా నిలిచారు.

మహామంత్రి వారిలో కరుణుడిని పిలిపించి, "నేనెంత చెబితే మహారాజుకి అంత. నేనిక పదవినుంచి తప్పుకోబోతున్నాను. నాకు పెళ్ళికి ఎదిగిన కూతురు ఉన్నది. ఆమె వివాహానికి తగిన సొత్తును ఇవ్వగలిగావంటే నీ పేరే సిఫార్సు చేస్తాను. ఈ సంగతి ఎవరికీ తెలియకూడదు సుమా! రేపు వచ్చి ఎంత ఇవ్వగలిగేదీ చెప్పు" అని పంపేశాడు. అతడు వెళ్లగానే కనకుడిని కూడా పిలిచి ఇలాగే చెప్పాడు.

మర్నాడు మంత్రి చతురుడు ఉద్యానవనంలో ఉండగా కరుణుడు వచ్చి కలుసుకున్నాడు. "మంత్రిగారూ! మీ కుమార్తె వివాహానికి ముందుగా లక్ష వరహాలను ఇవ్వగలను. నాకే పదవి ఇప్పించారంటే ముందు ముందు మరింత ముట్టజెప్పగలను" అన్నాడు. మంత్రి సరేనని అతడిని పంపించి వేశాడు.

మరికొద్ది సేపటికి కనకుడు వచ్చి మంత్రిని కలిశాడు. "మహామంత్రీ! మీ కుమార్తె వివాహం గురించి మీరేమీ దిగులు పడకండి. ఆమెను నేనే పెళ్లి చేసుకుని మీ ఖర్చంతా భరించగలను. అయితే అందుకు ముందుగా మీరు ఒక చోటకి వెళ్ళాల్సి ఉంటుంది" అన్నాడు.

"చాలా సంతోషం నాయనా! ఇంతకీ ఎక్కడికి?" అన్నాడు చతురుడు.

"శ్రీకృష్ణ జన్మస్థానానికి!" అంటూ కనకుడు చప్పట్లు కొట్టాడు. వెంటనే ఆ పక్కనే ఉన్న చెట్టు పక్క నుండి కొందరు భటులు బయటికి వచ్చారు. ఆ వెనుకనే మహా రాజు మందహాసుడు వచ్చాడు.

మంత్రి తెల్లబోయి చూస్తుండగా కనకుడు, "మహారాజా! చూశారుగా? మంత్రిని బంధించండి" అన్నాడు ఆవేశంగా.

మహారాజు వెంటనే మంత్రి దగ్గరకు వచ్చి "శెభాష్ మహా మంత్రీ! నిజాయితీగల యువకుడిని ఎంపిక చేయడానికి చక్కని యుక్తిని చూపారు" అన్నాడు. ఈసారి తెల్లబోవడం కనకుడి వంతయింది. మహారాజు అతడి భుజం తట్టి, 'మహామంత్రి తన పరీక్ష విధానాన్ని ముందుగానే నాకు చెప్పారు. ప్రలోభానికి గురవకుండా, మంత్రి మీదనే నాకు ఫిర్యాదు చేసిన నీ ధైర్యానికి మెచ్చుకుంటున్నాను. ఆ పదవికి నిన్ను తక్షణం ఎంపిక చేస్తున్నాను" అన్నాడు.

మంత్రి చతురుడు, "ఇతడు ఆ పదవికే కాదు ప్రభూ! నా అల్లుడి హోదాకి కూడా తగినవాడే నని భావిస్తున్నాను" అన్నాడు.

*(ఈనాడు దినపత్రిక, 12.1.2011)*



Scanned with CamScanner

# కర్పూరం



రంగనాథానికి లేకలేక కలిగిన సంతానం గిరీశం. అందువల్ల అతన్ని అల్లారుముద్దుగా అతి గారాబంగా పెంచారు. గిరీశానికి చదువురాలేదుగానీ చెడుస్నేహాలు, దురలవాట్లు బాగా వచ్చాయి. తండ్రి సంపాదించిన ధనాన్ని బయటకు తీసుకెళ్ళి ఖర్చుపెట్టడమే తప్ప మరేమీ చేసేవాడుకాదు,

కొడుకు ప్రవర్తనకిచాలా బాధపడ్డాడు రంగనాథం. అతనిలో మార్పు తీసుకురావాలంటే ఏంచేయాలో ఆలోచించ సాగాడు.

ఒకనాడు దైవప్రార్థన చేస్తుండగా గిరీశాన్ని పిలిచాడు రంగనాథం. పళ్లెంలో కర్పూరం వేసి అగ్ని అంటించి దేవుడికి హారతిచ్చి – "నాయనా! ఈ కర్పూరం చూశావా? కొంతసేపటి వరకు బాగానే వెలుగుతుంది. కర్పూరం అయిపోయిన వెంటనే ఆరిపోతుంది. ఆస్తికూడా కర్పూరం లాంటిదే. మనం ఖర్చుచేస్తూపోతే కొన్నాళ్లకు ఆస్తి యావత్తూ హరించుకు పోతుంది. కూర్చునితింటే కొండలైనా తరుగుతుంటాయి. మరలా కాకుండా వుండాలంటే ఈ కర్పూరం ఇలాగే వెలుగుతూ ఉండాలంటే ఏం చెయ్యాలి?" అని అడిగాడు.

"కర్పూరం బిళ్లలు తెచ్చివెయ్యాలి. అలాగైతే వెలుగుతుంది" అన్నాడు గిరీశం.

"నిజమే! కాని కర్పూరం బిళ్లలు తెచ్చుకున్నా అలాగే వేసు కొని కాలుస్తూ కూర్చోముకదా! దైవప్రార్థన చేసినప్పుడే కాలుస్తాం! అలాగే ఆస్తి కూడా హరించుకుపోకుండా ఉండా లంటే సంపాదించాలి. సంపాదించినా అవసరాలకే ఖర్చు పెట్టాలి. అప్పుడే జీవితం హాయిగా సాగిపోతుంది"అన్నాడు రంగనాథం.

తండ్రి మాటల్లో వున్న సత్యాన్ని తెలుసుకుని తన తప్పును సరిదిద్దుకున్నాడు గిరీశం.

***(ఆంధ్రభూమి వారపత్రిక, 4.12.86)***



# గర్వభంగం

ధవళరాజ్యాన్ని ధర్మశీలుడు పరిపాలిస్తున్న కాలమది. ఒకనాడు రాజు సభతీర్చియుండగా ఓ పండితుడు వచ్చాడు. అతడు రాజును సమీపించి "రాజా! నాకు ప్రపంచంలో ఉన్న అన్ని భాషలూ తెలుసు! మీ ఆస్థానంలోగల పండితులను నాతో పోటీకి పంపండి! వారి భాషా పరిజ్ఞానంతో నన్ను ఓడిస్తే నేను వారికి బానిసై పడి ఉండగలను. మరి మీవారే ఓడితే మీరు నన్ను ఘనంగా సత్కరించి మీ సింహాసనంపై అయిదు రోజులు కూర్చునే అవకాశం ఇవ్వాలి" అన్నాడు.

ఆస్థాన పండితుల్లో ఒకడైన చతురుడు లేచాడు. రాజాజ్ఞ అయింది. "అయ్యా పండితుడుగారూ నేను ఒకే ఒక్క ప్రశ్న వేస్తాను. మీరు జవాబు చెప్తే గెలుపుమీదే" అన్నాడు.

అందుకా పండితుడు అంగీకరించడంతో చతురుడు ఇలా ప్రశ్నించాడు.

"పుట్టిన ప్రతి బిడ్డా భూమ్మీద పడగానే, 'కేర్' మని ఏడుస్తుంది. ఈ 'కేర్' మన్న పదం ఏ భాషపదం?" అని అడిగాడు.

పండితుడు ఇరుకున పడ్డాడు. 'కేర్' మన్న పదం ఏ భాషకు చెందుతుందో ఎవరూ చెప్ప లేదు. ఎందుకంటే ఏ భాషకు చెందిన వారింట్లో బిడ్డ జన్మించినా 'కేర్' మనే ఏడుస్తారు. అందువల్ల "నాకు తెలియదు మీరే చెప్పండి" అన్నాడు.

అప్పుడు చతురుడు "మీరు జవాబు చెప్తే గెలుపు మీదే అన్నాను. కాని మీరు చెప్ప (లే)క పోతే నేను చెబుతానని అనలేదు. మీరు జవాబు చెప్పలేదు కాబట్టి ఓడినట్లే" అన్నాడు.

ఆ పండితుడికి గర్వభంగం అయింది.

*(స్వాతి వారపత్రిక, 1.5.1987)*



Scanned with CamScanner

# సలహా

భీమరాజుకి అనుకోకుండా కొన్ని వేల రూపాయలు లాభం కలిసివచ్చింది. ఆ సొమ్ము ఏ విధంగా వినియోగిస్తే, తనకు లాభకరంగా ఉంటుందో అతనికి తెలియలేదు.

అతని భార్య వసంత, "ఏమండీ! మనము ఇంత వ్యాపారం చేసి గడిస్తున్నా, అద్దె ఇళ్ళలో ఉండి, కాలం వెళ్లమార్చుకుంటున్నామే కాని, మనకంటూ స్వంతంగా ఇల్లుకట్టుకుంటే బాగుం టుందండీ!" అంది.

అతని తల్లి "బాబూ! వ్యాపారంలో దిగే ముందు చేసిన అప్పు తీర్చివేస్తే, మనకు తృప్తిగా ఉంటుంది.!" అంది. అతని పిల్లలు మనం ఇప్పుడైనా ఆధునిక వస్తువులు ఏవైనా కొంటే బాగుం టుంది. మనం అన్నింటికీ ప్రక్కవాళ్లింటికి పోవడమో, లేక ముఖం దిగాలుగా పెట్టుకుని చూడడమో జరుగుతోంది!" అన్నారు.

భీమరాజుకి ఏం చేయడానికి పాలుపోలేదు. అందరి మాటలూ సబబైనవే మరి! కాని, ఏది చేస్తే తనకి లాభమో అర్థం కావడం లేదు. అతడు తన మిత్రుడు, తెలివైన వాడు అయిన సోమ శేఖరాన్ని కలుసుకొని, తన తీరని సమస్య చెప్పాడు.

సోమశేఖరం క్షణకాలం ఆలోచించి, "నువ్వు నీ భార్య చెప్పినట్లుగా ఇల్లూ కట్టకు! నీ తల్లి చెప్పినట్లుగా అప్పులూ తీర్చకు! అలాగని పిల్లలు చెప్పినట్లు ఆధునిక వస్తువులూ కొనకు. ఇక నా సలహా విను, ఆ సొమ్ముతో మంచి కూడలి ప్రదేశంలో ఓ దుకాణం తెరిచి, వ్యాపారం సాగించా వంటే, పెద్ద లాభం పొందుతావు! లేకపోయినా అది కూడలి ప్రదేశం కనుక మరింత లాభంతో ఆ దుకాణం ఇతరులకు అమ్మివేయవచ్చు!" అన్నాడు.

ఆ సలహా నచ్చిన భీమరాజు అలాగే చేశాడు. అక్కడ దుకాణంకి మంచి రద్దీ ఉండడంతో లాభాలు గడించి, తన భార్య, తల్లి, పిల్లల కోర్కెలు తీర్చాడు.

(బాలమిత్ర)





Scanned with CamScanner

# అపోహ

పూర్వము పురిక అనే ఒక రాజ్యాన్ని పౌరకుడు అనే రాజు పరిపాలించే వాడు. అతడు దుష్టుడు. అతని పరిపాలనలో నీతి, ధర్మం, న్యాయం మచ్చుకైనా కనబడేవి కావు. అతడి పాప కార్యములకు అంతు ఉండేదికాదు. అటువంటి రాజైన పౌర కుడు కాలవశమున చని పోయాడు. అతడి పాప కార్యములకు శిక్షగా అతడు నక్కయై భూలోకమందే జన్మిం చాడు. అతడు నక్కగా జన్మించినప్పటికీ గత జన్మ వృత్తాంతమంతా గుర్తుండే జ్ఞానము పొందాడు.



గతజన్మలో తాను రాజునన్న విషయం అనుక్షణం గుర్తుండడంతో నక్కగా ఉన్నప్పటికీ మంచి వ్రతాన్ని పాటిస్తుండేవాడు. ఆ వ్రతం ఏమిటంటే మాంసమును తినకపోవటం, ఇతర జంతువులను చంపకపోవటం, ఆ వనమం దున్న పండ్లు ఆకులు మొదలగు పదార్థములు మాత్రమే భుజించటం!

ఈ విధంగా నిష్ఠగా కాలము గడుపుతుండే వాడు. ఈ విషయము తెలుసుకున్న మిగతా నక్కలు ఆ నక్కవద్దకు వచ్చి "బంధువుడా! సోదరుడా! నీవు నియమనిష్ఠలతో కాలము గడుపుట వలన ప్రయోజనం లేదు. నీకు అవసరమైన మాంసాన్ని మేము ఇస్తాము. తిని హాయిగా కాలము గడుపు" అన్నాయి. కాని ఆ నక్క అందుకు సమ్మతింపలేదు.

ఒకనాడు ఆ అడవి లోకెల్లా పెద్ద జంతువైన పెద్ద పులి ఆ నక్క విషయం పూర్తి గా తెలుసుకొని అక్కడకు వచ్చింది. "పుణ్యాత్ముడా! నీవు శాంతచిత్తుడవని, సాధుస్వభావం గలవాడివని తెలుసుకొని ఇక్కడకు వచ్చాను. నన్ను అన్ని జంతువులు 'క్రూరుడు' అన్న పేరుతో సూచించడం నాకు బాధగా ఉన్నది. నీవు నాతో స్నేహం చేసి, నీ యందున్న మంచితో నన్ను మార్చి, నా ప్రవర్తన, నడవడిలో కూడ మార్పు తెచ్చి నన్ను మంచివాడుగా తీర్చిదిద్దు" అని అడిగింది.

ఆ మాటలు విన్న నక్క "పులీ! నీవు నా లాంటి సాధుజంతువును ఆశ్రయించుటకు తగినవాడవు కావు! అయినా నీ మేలు, మంచి కోరి నే చెప్పే మాటలు జాగ్రత్తగా విను! నాకు భోగములందు ఆసక్తిలేదు. నీకు భోగములంటే ప్రీతి. ఈ విషయంలో నేను నా విధానము

మార్చుకొనకయే నీతో స్నేహం చేస్తాను. కాని నీలాంటి బలవంతుడితో నా లాంటి సాధు జంతువు కలసి మెలసి స్నేహంగా ఉన్న యెడల నీ మూలభృత్యులకు ఇష్టపడదు. నేను నీతి చెప్పి నిన్ను మంచి మార్గంలో పెట్టడం వారు సహించ లేరు. అప్పుడు వారు మనిద్దరి మధ్య కలహము సృష్టించడానికి ప్రయత్నిస్తారు. అందువలన నీవు నాకు ఒకమాట ఈయవలెను. నీ భృత్యులు మన స్నేహం చెడగొట్టే ఏ మాటలు చెప్పినా పట్టించుకోనని మాటివ్వు!" అని అడిగింది.

పులి నక్క మాటలు విని, తనతో స్నేహం చేసేందుకు ఒప్పుకున్నందుకు ఎంతో సంతో షించి మాట ఇచ్చి ప్రమాణం చేసింది. నక్కను గూడ తన గృహమునకే తీసుకుపోయి వారు కలసి మెలసి సంతోషంగా ఉండసాగారు.

పులి, నక్క కలసి స్నేహంగా ఉండడం భృత్య జంతువులకు నచ్చలేదు. అవి చాలాసేపు ఆలో చించి ఒక నిర్ణయానికి వచ్చాయి. పులి, నక్క లేని సమయంలో పులికోసం ఉంచిన మాంసా న్ని దొంగిలించి నక్క స్థావరంలో దాచిపెట్టాయి. పులి కోసం పంపే సకల ఆహార పదార్థాలు నక్క రక్షణలోనే ఉంటాయి. ఇందువల్ల నక్కపై పులికి కోపం వస్తుందని భృత్యుల నమ్మకం!

నక్క మామూలుగా వచ్చి పులికి ఆహారం సిద్ధం చేయడానికి చూసింది. కాని మాంసం కనబడలేదు. వెంటనే వెళ్ళి మాంసం దొంగి లించబడిందని ఫిర్యాదు చేసింది. పులి తన కోసం ఉంచిన మాంసం దొంగిలించబడడం తో కోపంతో విచారణ చేయడానికి సిద్ధపడింది.

పులి మూలభృత్యులు పులి ఒంటరిగా ఉన్న సమయంలో వచ్చి, "పులిరాజా! గొప్ప మోసం జరిగిపోయింది. మీ కోసం ఉంచిన మాంసాన్ని నక్కగాడే దొంగిలించాడు. వాడు ఒట్టి మోసకారి. మీ మాంసాన్ని తనగృహంలో దాచాడు. కావాలంటే ఋజువులతో సహా చూపి స్తాం" అన్నాయి.

పులి వారిని ఋజువు చూపమనడంతో తక్షణం అవి వెళ్ళి నక్క స్థావరం నుంచి మాంసం తెచ్చి చూపాయి.

పులికి నక్కపై కోపం వచ్చింది. "భృత్యు లారా! మాయదారి, మోసకారి అయిన ఆ నక్క ఎక్కడ ఉన్నా తక్షణం చంపి తీసుకురండి!" అని ఆజ్ఞాపించింది.

పులి మాటలు విన్న పెద్దపులి తల్లి గబగబా అక్కడకు వచ్చింది. "నాయనా! నీవు నీ భృత్యుల మాటలు నమ్మి నీ ప్రాణ స్నేహితుడినే అనుమానిస్తున్నావు. ఆ నక్క ఇటువంటి చెడ్డ పనులు చేయలేదు. అతడు జ్ఞాని. బుద్ధి మంతుడు. అందమైన స్త్రీని చూసి వికార రూపులు అసూయ చెందినట్లే అటువంటి బుద్ధి మంతుణ్ణి చూసి బుద్ధిహీనులైన నీ భృత్యులకు అసూయ కలిగింది. అందువల్లనే వీరు ఈ విధంగా మీ మధ్య వైరం సృష్టిస్తున్నారు.

కుమారా! ధర్మము అధర్మము వలె ఒక్కొక్క ప్పుడు కనబడుతుంది. బుద్ధిమంతుడైనవాడు



Scanned with CamScanner



తన జ్ఞానముతో రెండింటిని విచారించి నిర్ణయం తీసుకోవాలి. కాని నీవు నీ భృత్యుల మాటకే విలువ ఇచ్చి అతడిని చంపేందుకు తీసుకు రమ్మన్నావు! నీ నక్క మిత్రుడు మన గృహానికి వచ్చిన నాటి నుండి నీకు చేసిన మేలు మరచి పోకు" అని పరి పరి విధముల బోధించింది.

తల్లి మాటలతో జ్ఞానోదయమైన పులి నక్కను పిలిపించి కౌగిలించుకుంది. నక్క తనపై పడిన నిందకు కళ్ల నీళ్ళు కారుస్తూ "మిత్రమా! నీవు నీ భృత్యుల మాటలకు విలువ ఇచ్చి నీ స్నేహితుని మరచి చంపేందుకు ప్రయత్నించావు! మొదట చేసిన మన ప్రమాణం మరచి పోయావు! ఎట్టి పరిస్థితులలోను భృత్యుల మాట నమ్మనని నాకు ఇచ్చిన మాట తప్పావు! అయినా నేను బాధపడను. ఇంకెవరినీ ఇదే విధంగా అనుమానించకు. నీలాంటి బలవంతు డితో స్నేహం చేయడం నా తప్పు" అని చెప్పి అక్కడ నుండి వెళ్ళిపోయింది.

అలా వెళ్ళిన నక్క ఆహారము భక్షించలేదు. మంచి దీక్షగా గడిపి పేరుపొంది కొన్నాళ్ళ తరువాత చనిపోయి పుణ్యలోకాలకు వెళ్ళింది.

ఈ కథ వలన మనం గ్రహించవలసిన నీతి ఏమంటే – "రాజైనవాడు ఎవరి యందు ధర్మం గలదో, ఎవరి యందు అధర్మం గలదో, ఎవ్వడు సజ్జనుడో, ఎవ్వడు దుర్జనుడో స్వయంగా యోచించి, శిక్షించే నేర్పు కలిగి ఉండాలి".

***(సప్తగిరి మాసపత్రిక, ఆగస్టు 1985)***



# తమసోమా జ్యోతిర్గమయ

పార్వతీపురంలో పారయ్య అనే రైతు ఒకడు ఉండేవాడు. అతనికి భగవంతుడిమీద నమ్మకం లేదు. అతని ముందు ఎవరైనా దేవుడి ప్రస్తావన తీసుకువస్తే "కనిపించని ఆ దేవుణ్ణి నమ్మే వాళ్ళందరూ తెలివితక్కువవాళ్ళు. అంతేకాదు సోమరిపోతులు. తమ సోమరితనాన్ని కప్పిపుచ్చు కోడానికి గుళ్ళూ, గోపురాలూ సందర్శించే నెపంతో పని ఎగవేస్తారు" అని దూషించేవాడు. అందుకని ఆ వూళ్లో ఎవ్వరూ అతడి ముందు దేవుడి గురించి పొరపాటున కూడా మాట్లాడే వారు కాదు.

ఇలా ఉండగా ఆ గ్రామానికి హిమాలయాల నుండి ఒక జ్ఞాని వచ్చాడు. ఎలాంటివారి ప్రశ్నలకైనా జవాబిచ్చి సంతృప్తిపరుస్తున్నాడు.

గ్రామస్తులు తండోపతండాలుగా జ్ఞాని దర్శనం చేసుకుని తమతమ సందేహాలు తీర్చుకుని తృప్తిపడి వస్తున్నారు.

అలా జ్ఞాని వద్దకు వెళ్ళి వచ్చిన వారిలో పారయ్య భార్య పార్వతమ్మ కూడా ఉంది. ఆమెకు దైవభక్తి మెండు. అందువల్ల తన భర్త నాస్తికత్వాన్ని గురించి జ్ఞానితో చెప్పుకుంది.

దానికి జ్ఞాని "భగవంతుణ్ణి గూర్చి తెలుసుకోవడం నాలాంటి వారికే సాధ్యం కావడం లేదు. నువ్వూ నీ భర్తా ఒక లెఖ్ఖా? అయినా నీ భర్తను తీసుకుని ఇక్కడకు వస్తే



నోరంశెట్టి ఉమామహేశ్వరరావు

నా ప్రయత్నం నేను చేస్తాను" అని చెప్పి పంపించాడు.

పార్వతమ్మ భర్తకు ఎన్నో విధాల నచ్చచెప్పి జ్ఞాని వద్దకు పంపింది. పారయ్య వెళ్ళేసరికి జ్ఞాని వద్ద చాలామంది జనం ఉన్నారు.

చాలాసేపటి తర్వాతగాని పారయ్యకు జ్ఞాని వద్ద నుండి పిలుపురాలేదు. పిలుపు వచ్చిన తర్వాత జ్ఞాని దగ్గరకెళ్ళి తన సందేహం చెప్పుకున్నాడు పారయ్య.

జ్ఞాని అతనిని గుర్తుపట్టి "నీ గురించి నీ భార్యతో సహా గ్రామస్తులంతా చెప్పారు. నీవు లోపల గదిలో నా కోసం ఎదురుచూస్తూ కూర్చో" అని చెప్పాడు.

'అలాగే స్వామీ' అని చెప్పి లోపల గదిలోకి అడుగుపెట్టాడు పారయ్య.

గదినిండా దట్టంగా చీకటి ఆవరించి ఉంది. ఏ వైపు నుండీ కాంతి రావడానికి మార్గం లేదు. కాంతి రావడానికి మార్గం లేనట్లే గాలి రావడానికి కూడా మార్గం లేక కొద్దిసేపటికే ఉక్కబోయసాగింది అతడికి. అయినప్పటికీ సహనంగా చాలాసేపు ఎదురు చూస్తూ కూర్చున్నాడు జ్ఞానికోసం.

మరికొంత సమయం గడిచిన తర్వాత జ్ఞాని పారయ్య ఉన్న గదిలోపలకు వెళ్ళాడు. "ఎక్కడున్నావయ్యా? అసలు ఉన్నావా? వెళ్ళిపోయావా?" అని ప్రశ్నించాడు జ్ఞాని. బహుశా చీకటిలో ఉన్న పారయ్య అతనికి కన్పించలేదేమో!

దానికి పారయ్య "ఇక్కడే కూర్చుని మీ రాక కోసం ఎదురుచూస్తున్నాను" అని జవాబిచ్చాడు.

దానికి సమాధానంగా జ్ఞాని "దేముడి గురించి తెలుసుకోవాలంటే సహనం, ఓపిక, ముఖ్యం. అవి నీకు ఉన్నాయో లేదో పరీక్షించడానికే ఉక్కబోసే ఈ గదిలో ఉండమన్నాను. నీవు ఓపికగా నిరీక్షించావు. ఇప్పుడు నిరభ్యంతరంగా నీ సందేహానికి జవాబివ్వాలనుకుంటున్నాను" అని ఆగి, "నేను నీకు కన్పిస్తున్నానా?" అని ప్రశ్నించాడు.

జ్ఞాని లోపలకు వస్తూనే ఉన్న ఒక్క తలుపూ మూసివేసినట్లున్నారు సేవకులు. దాంతో పూర్తిగా అంధకారం అలుముకుంది గదిలో! కళ్ళు పొడుచుకున్నా ఏమీ కనిపించడంలేదు. అందువల్ల పారయ్య "మీరు కన్పించడంలేదు స్వామీ!" అని జవాబిచ్చాడు.

జ్ఞాని వెంటనే "మరి నేనిక్కడ ఉన్నట్లా? లేనట్లా?" అని ప్రశ్నించాడు.

పారయ్య అది విని "అదేంటి స్వామీ అలా అడుగుతారు? నాతో మాట్లాడుతున్నారు కదా! మీరు కనబడకపోయినంత మాత్రాన 'లేరు' అని చెప్పగలనా?" అని తిరిగి ప్రశ్నించాడు.

అప్పుడు జ్ఞాని "సరిగ్గా చెప్పావు. మరి నా గురించి నీవు అనుకున్నట్లే ఆ భగవంతుడి గూర్చి కూడా ఎందుకు అనుకోరాదు. ఈ సృష్టికార్యం ఇంత సవ్యంగా జరుగుతోందంటే ఆ భగవంతుడు ఉండబట్టేకదా! మరి మనకు కన్పించకపోయినంత మాత్రాన భగవంతుడు 'లేడ'ని

చెబితే ఎలా? చీకటిలో నేను ఉండడం వల్ల నీకు కన్పించలేదు. అలాగే మనం అజ్ఞానం అనే చీకటిలో ఉంటే భగవంతుని దర్శించలేము. తెలిసిందా?" అని చెప్పాడు.

పారయ్య అది విని "స్వామీ! మీ మాటలు నేను విశ్వసించలేక పోతున్నాను" అన్నాడు.

జ్ఞానికి పారయ్య సందేహం నివృత్తి చేయాలన్న ఆలోచన ఉండడంతో మరల శాంతంగా "నీ విప్పుడు నీ నీడ చూపించు" అని అడిగాడు.



"చీకటిలో నీడ నెలా చూపగలం స్వామి?" అన్నాడు పారయ్య.

అప్పుడు జ్ఞాని సేవకుణ్ణి పిలిచి దీపం తెప్పించాడు. గదిలో దీపం వెలుగు ప్రసరించగానే ఒకరి కొకరు కన్పించడమే కాకుండా వారి నీడలు గోడమీద ప్రత్యక్షమయ్యాయి.

అప్పుడు జ్ఞాని, "చూడు పారయ్యా! నీమీద వెలుగు ప్రసరించగానే నీ. నీడ ఎలా ప్రత్యక్షమయిందో, అలాగే భగవంతుడుకూడా ప్రత్యక్షం అవుతాడు. ఎప్పుడో తెలుసా? ఎప్పుడైతే నీవు భక్తి అనే ప్రమిదలో విశ్వాసం అనే దీపం వెలిగించి జ్ఞానం అనే కాంతి విస్తరింపజేయగలవో అప్పుడు నీకు భగవంతుడు కన్పిస్తాడు. భగవంతుడు నీ నీడ లాంటివాడు. వెలుగు నీ మీద ప్రసరిస్తే నీ నీడ ఎలా కన్పిస్తుందో అలాగే జ్ఞానం అనే కాంతి రేఖలు నీలో విస్తరించిన నాడు భగవంతుడూ నీకు కన్పిస్తాడు. భగవంతుడు కన్పించడం, కన్పించక పోవడం అనేది అంతా నీలో ఉంది" అని ముగించాడు.

అప్పుడు పారయ్య "ఇంత కాలం నా అజ్ఞానంతో దేవుడు లేడని వాదించి ఎంతో పాపం చేశాను. ఇన్నాళ్లకి తమరు నా తప్పు నేను తెలుసుకొనేలా చేశారు స్వామీ!" అని జ్ఞానికి సాష్టాంగపడ్డాడు.

*(బాలమిత్ర, ఏప్రిల్ 1993)*

# ధైర్యం

వీరనాథుడు, శివనాథుడు ఇద్దరూ మహారాజు మణిగంధుడి ఆస్థానంలో కొలువు చేస్తున్నారు. వీరిద్దరికీ ప్రతిదానికి విభేదాలు వస్తుండేవి. శివనాథుడు సాత్వికుడు. బాగా ఆలోచించి ఏ పనైనా చేస్తాడు.

ఒకసారి వారిద్దరూ కలసి దూరప్రయాణం చేయవలసి వచ్చింది. అది వర్షాకాలం! వారిద్దరూ కలిసి ప్రయాణం చేస్తూ ఒక నది దాటవలసి వచ్చింది. ఆ నది పేరు స్వర్ణముఖి. వీరిద్దరూ ఒడ్డున నిలబడి వుండగా తెప్పపై జాలరి ఒకడు కొందరు మనుషుల్ని తీసుకు వస్తూ కన్పించాడు.

ఆ తెప్ప నది మధ్యకు వచ్చిందనే సరికి వరదలు ఎక్కువయ్యాయి. నది ప్రవాహ వేగం తోబాటు లోతు కూడా పెరగసాగింది. తెప్పపై కూర్చున్న వాళ్లు భయపడుతున్నారు.

అది గమనించిన వీరనాథుడు "ఇలాంటి సమయంలో జాలరికి ధైర్యం ఉండాలి లేకపోతే ప్రమాదం" అన్నాడు.

దానిని వ్యతిరేకిస్తూ శివనాథుడు "జాలరి కంటే తెప్పలో ఉన్నవాళ్ళకి ధైర్యం ఉండాలి. వాళ్ళకి లేకపోతే ప్రమాదం" అన్నాడు.

"నీవు అంటున్నది అబద్ధం. పందెం కాద్దామా?" అన్నాడు కోపంగా వీరనాథుడు.

"పందెం వద్దు, ఆ దృశ్యం చూడు" అంటూ తెప్పవైపు చూపాడు శివనాథుడు.


నదిలో వరదలు పెరిగి తెప్ప ఊగిపోతోంది. జాలరి తెప్పలోవారికి ధైర్యం చెబుతూ "మీకేం ప్రమాదం లేదు. నేను జాగ్రత్తగా ఒడ్డుకు చేరుస్తాను. అలాగే కదలకుండా కూర్చోండి" అన్నాడు.

అయినా తెప్పలోని వాళ్ళు ఒకరిద్దరు భయపడి గెంతేశారు. దాంతో తెప్పకు సమంగా బరువులేక అటూ ఇటూ ఊగి మునిగిపోయింది. జాలరి ఈదుకుంటూ ఒడ్డు చేరాడు. మిగిలిన వారికి ఈదడం చేతకాక మునిగి పోయారు.

అదంతా చూపి "ఇప్పుడైనా ఒప్పుకుంటావా? జాలరికంటే తెప్పలోని వారికే ధైర్యం ఉండాలని?" అని అడిగాడు శివనాథుడు.

'అవు'నని అంగీకరించాడు వీరనాథుడు.

***(కావ్యజ్యోతి వారపత్రిక, 15.2.1988)***



# సరికి సరి!



వీర్రాజు త్రాగుబోతు. అతడు అర్ధరాత్రి సమయంలో మస్తుగా త్రాగి, జోగుతూ సైకిలు తొక్కుతూ "లాహిరి లాహిరి లాహిరిలో... ఓహో జగమే ఊగెనుగా..." పాటలు తన పరిస్థితికి అన్వయించేలా – త్రాగుబోతు భాషలో పాడుతున్నాడు.

అతడు జోగుతూ తొక్కుతున్న సైకిలు తిన్నగా వెళ్ళి దేన్నో గుద్దినట్లయితే, కళ్ళు తెరిచి మరీ చూసాడు– వీర్రాజు. ఎదురుగా పోలీసు కనబడితే, "నమష్కారం షార్" అన్నాడు ముద్దగా! సైకిలు దిగి పక్కకు తిప్పబోయాడు వీర్రాజు! పోలీసులు అతన్ని వదల్లేదు. "తప్పయింది షెమింషండి!" అన్నాడు ఈ సారి!

అయినా, పోలీసు వదిలిపెట్టలేదు. "నిన్ను పట్టుకొని ఆపింది– నీ సైకిలుకి లైటు లేకుండా తొక్కుతున్నందుకు. ముందు స్టేషన్‌కు పద!" అన్నాడు కోపంగా!

వీర్రాజు వెంటనే " అటు చూడండి. వీధి లైట్లన్నీ వెలిగి ఎంతో కాంతి ఇస్తున్నాయ్! నా సైకిలు లైటు లేకపోతే నష్టమేంటి?" అని అన్నాడు తెలివిగా!

ఆ పోలీసు వెంటనే వంగి సైకిలు గాలి తీసేసి, "ప్రపంచమంతటా గాలి ఉంది కదా! ఇప్పుడు సైకిలుకి గాలి లేకపోయినా నష్టం లేదులే పో!" అన్నాడు.

'సరికి సరి సరిపోయిం'దనుకుంటూ వీర్రాజు బిక్క మొహం వేసాడు.

***(బాలమిత్ర, సెప్టెంబరు 1988)***

# వేళా విశేషం

స్వర్ణముఖినది ఒడ్డునగల దట్టమైన అడవి లోకి దారితప్పి వచ్చిందో మేకపిల్ల.

ఆ అడవిలోన ఉన్న ఓ దుష్ట నక్క దానిని చూసి తినాలన్న కోరిక కలిగి ఓనాడది నదిలో నీరు త్రాగుతుండగా గభాలునొచ్చి దాని పీక నోట కరుచుకుంది.

ప్రమాదం పసిగట్టిన మేకపిల్ల చుట్టూ చూసింది. దాని కంటికి ఆ నీటిలోంచి వెళ్తున్న ఓ పాము కన్పించింది.


దాంతో ఆ మేకపిల్ల "నక్క బావా! ఆగు నన్ను పాము కాటేసింది. నన్ను నువ్వు తిన్నా వంటే నా శరీరమంతా విషపూరితమై ఉండటాన నవ్వూ చస్తావ్" అంది.

ఆ మాటలు వినడంతోపాటు నీటిలోని పామును కళ్ళరా చూసిన ఆ తెలివితక్కువ నక్క నోటికరిపించుకున్న మేకపిల్ల తలను వది లేసింది.

అది మరింత నమ్మగలందులకు ఆ మేక పిల్ల నేలమీద పడి నాలుగైదుసార్లు పొర్లింతలు కొట్టి చచ్చినట్లుగా పడిపోగా, ఈరోజు వేళా విశేషం బాగుండబట్టి బ్రతికిపోయాననుకుంటూ నక్క వెళ్ళిపోయింది.

నా వేళా విశేషం బాగుండబట్టి బ్రతికి పోయాననుకుంటూ ఆ నీళ్ళ పాముకు మనసు లోనే కృతజ్ఞతలు తెల్పుకుంటూ అక్కడ్నించి చక్కా బోయిందా మేకపిల్ల.

*(బుజ్జాయి, ఫిబ్రవరి 1985)*



# యువకుని ధైర్యం

అది రాజమహేంద్రవరంలో ఒక గృహం. ఓ పేదవాడి ఇల్లు! వారింట్లో ఒక వ్యక్తికి జబ్బు చేసింది. అది నయం చేస్తానంటూ వచ్చాడొక భూతవైద్యుడు. "హ్రాం హ్రీం" అంటూ నెల రోజులకు పైగా మంత్రాలు చదువుతున్నాడే గానీ జబ్బు మాత్రం నయం కాలేదు.

నెలరోజులయ్యాక ఆ భూతవైద్యుడు తన ముడుపు చెల్లించమని కూర్చున్నాడు. అసలే వాళ్ళు పేదవాళ్ళు. జబ్బూ కుదరలేదు. ఈ భూత వైద్యుడికి డబ్బు ఎలా ఇవ్వగలరు? వారు భూత వైద్యుడిని ప్రాధేయపడుతూ ప్రార్థిస్తున్నారు. కాని భూతవైద్యుడు కఠినంగా డబ్బిస్తేగానీ కదలను అని కూర్చున్నాడు.

అంతలో ఆ ప్రక్క ఇంటివారి అబ్బాయి వచ్చి సంగతి తెలుసుకున్నాడు. భూత వైద్యుణ్ణి సమీపించి "డబ్బు ఇవ్వరు. దిక్కున్న చోట చెప్పుకో" అని ఖచ్చితంగా చెప్పాడు.



భూతవైద్యుడికి కోపం వచ్చి "నిన్ను చేతబడి చేసి చంపేస్తాను" అని బెదిరించాడు. ఆ యువకుడు భయపడలేదు. ఆ మాటలకు తిరిగి "నీ కంటే నాకు పెద్ద మంత్రాలే వచ్చు. మళ్ళీ మాట్లాడావంటే నా శరభసాళ్వ మంత్రం చదివి నిన్ను ఇక్కడే రక్తం కక్కుకుని చచ్చేలా చేస్తాను" అన్నాడు.

ఆ మంత్రం పేరే ఎరుగని భూతవైద్యుడు మంత్రపఠనం మాని పలాయన మంత్రం పఠించాడు. ఆ సంఘటనతో భూతవైద్యుణ్ణి బయటకు పంపిన ఆ యువకుడు ఎవరనుకున్నారు? ఆంధ్రసాహిత్య సాంఘిక రంగాలలో నవయుగ వైతాళికుడు శ్రీ కందుకూరి వీరేశలింగం పంతులు!

**(చిన్నారి, మార్చి 1987)**



Scanned with CamScanner

# ఎవరు గొప్ప!

కేరళదేశంలోని ఉత్తరభాగానికి విపరీతమైన కరవు వచ్చింది. పంటలులేక తిండి గింజలు కరవై ఎందరో మనుషులు ఆకలి చావులు చస్తున్నారు. పశువులకు మేతలు లేక అవి చనిపోతున్నాయి. పొలాలు ఎండి బీటలు దేరాయి.

ఆ ప్రాంత ప్రజలకు సహాయం చేయడానికి రాజు కరాళుడు సంసిద్ధత వ్యక్తం చేశాడు. ఖజానా నుండి ధనం తీసి సహాయ సామగ్రి తెప్పించాడు. ఐనా చాలలేదు. తన రాజ్యంలోని వేరే ప్రాంతాల ప్రజలను ఎవరికి తోచింది వారిని ఇమ్మని చాటింపు వేయించాడు. దాని ప్రకారం సహాయనిధి ఏర్పాటు చేశారు.

సహాయనిధి వివరాలు చూస్తున్న రాజుకి సందేహం వచ్చింది. అందులో వెంకడు అనే బిచ్చగాడు ఒక వరహా సహాయంగా ఇస్తే మదనుడు అనే కోటీశ్వరుడు వేయి వరహాలు ఇచ్చాడు. వీరిలో ఎవరిచ్చింది ఎక్కువో చెప్పమని కోరాడు రాజు.

అప్పుడు మంత్రి మాధవుడు "రాజా! బిచ్చగాడు ఇచ్చినదే ఎక్కువ! ఒక కోటీశ్వరుడికి తన సంపదలో వేయి వరహాలు సహాయం చేయడం గొప్ప విషయం కాదు. తన పొట్ట కోసమే ఎందరినో యాచించే ఒక బిచ్చగాడు ఒక వరహా సహాయం చేయడం నిజంగా గొప్ప విషయమే! వారిద్దరిలో బిచ్చగాడే గొప్పవాడు" అన్నాడు.

రాజు సంతృప్తిగా తల ఆడించాడు.

(చిన్నారి, మార్చి 1987)



# 'మేలెరిగిన మనిషి' బాలల కథల సంపుటిపై ప్రముఖుల స్పందన!

"ప్రతి కథ ద్వారా ఏదో ఒక మంచి సందేశం అందించడం ఉమామహేశ్వరరావుగారు చేసిన గొప్ప పని. ఇందులో కథలన్నీ కూడా రకరకాల మలుపులతో సాగుతాయి. అవి ఏదో ఒక సందేశాన్ని అందించి బాలల్లో వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందిస్తాయి."

**- శ్రీ రెడ్డి రాఘవయ్య, బాలసాహిత్య చక్రవర్తి, హైదరాబాద్.**

"శ్రీ నారంశెట్టి ఉమామహేశ్వరరావుగారు రాసిన 'మేలెరిగిన మనిషి' కథల సంపుటి ఎంతో ముచ్చటగా ఉండి వెంటనే చదివించేలా చేసింది కథలన్నీ ఆసక్తికరంగా ఉన్నాయి. అమ్మానాన్నల మీద రాసిన కవిత కంటనీరు తెప్పించింది.

**- శ్రీ వాసాల నరసయ్య, ప్రముఖ బాలసాహితీవేత్త, మెట్‌పల్లి.**

"మేలెరిగిన మనిషి" కథల సంపుటి చూసి ఎంతో ముచ్చట పడ్డాను. మంచి ప్రయత్నం చేసిన మీకు అభినందనలు. ఇలాగే మీ రచనా వ్యాసంగం ముందుకు సాగాలి.

**- యెన్నం ఉపేందర్, డైరెక్టర్ ఆఫ్ పోస్టల్ సర్వీసెస్, విశాఖపట్టణం.**

ఉమామహేశ్వరరావు గారి కలం నుండి విరచితమైన ప్రతి కథ విద్య యొక్క అంతిమ లక్ష్యం నెరవేర్చడానికే నన్నట్టు మనసులను తట్టి లేపుతాయి. ఈ సంపుటి పిల్లల మనసులకు పట్టిన దుమ్మును వదిలించడానికి, ప్రేమపూరిత సామాజిక నిర్మాణానికి బాటలు వేయడానికి ఎంతగానో దోహద పడుతుంది.

**- డొల్లు పారినాయుడు, వ్యవస్థాపకులు, జట్టు ఆశ్రమం, పార్వతీపురం, ఎడిటర్, నాగలి, ప్రభుత్వ పత్రిక**

"కథలన్నీ గబగబా చదివించేలా హృద్యంగా రాసారు. ఆలస్యంగానైనా మంచి పని చేశారు. అభినందనలు."

**- బెలగాం భీమేశ్వరరావు, ప్రముఖ బాలసాహితీవేత్త, పార్వతీపురం**

"పుస్తకం చూసాను. చాలా బాగుంది. కథలన్నీ, నీతిమంతంగా ఉండి బాలల మనసులను రంజింపచేసేలా ఉన్నాయి. ఇంత మంచి కథలు రాసిన మీరు మా పత్రికకు కూడా రెగ్యులర్‌గా రాయండి. ముఖచిత్రం మొదలుకొని చివరిపేజీ వరకు చాలా బాగుందని మా సంపాదకవర్గం మిమ్మల్ని అభినందిస్తున్నారు."

**- శ్రీ కె. రాజశేఖరరాజు, అసోసియేట్ ఎడిటర్, చందమామ, చెన్నయ్**

"మేలెరిగిన మనిషి" పుస్తకం చదివాను. చాలా బాగుంది. కథలన్నీ కొసమెరుపుతో బాలలను ఆకట్టుకొనేలా ఉన్నాయి. మంచి పయత్నం చేశారు. అభినందనలు.

**- శ్రీ జీ.అప్పారావు, సంపాదకుడు, బుజ్జాయి , చెన్నై**

"మేలెరిగిన మనిషి" బాలల కథల సంపుటి చదివాను. కథలన్నీ చాలా బాగున్నాయి. ఈ పుస్తకాన్ని పిలల్లలు ఎంతో ఇష్టపడిచదువుతారు.

**- డాక్టర్ టి.వేదాంతసూరి, చీఫ్ సబ్‌ఎడిటర్, వార్త దినపత్రిక, హైదరాబాద్**



Scanned with CamScanner

"మేలెరిగిన మనిషి" కథల సంపుటి చాలా అందమైన ముఖచిత్రంతో ఆకట్టుకొనేలా తీర్చిదిద్దారు. కథలన్నీ నీతిదాయకంగా ఉండి చక్కని సందేశాన్ని ఇస్తున్నాయి. ఇలాంటి పుస్తకాలు మీరు చాలా తీసుకురావాలి. అభినందనలు..

**– శ్రీ చొక్కాపు వెంకటరమణ,**
***'బాలసాహితీభూషణ', బాలసాహితీపరిషత్ అధ్యక్షులు, హైదరాబాద్***

"మేలెరిగిన మనిషి" పుస్తకంలో కథలన్నీ సందేశాత్మకంగా, కొసమెరుపుతో ముగించేలా ఉండి, బాలలను ఆకట్టుకొనేలా ఉన్నాయి. బాలల మనసుల నెరిగిన శ్రేష్ఠమైన కథల సమాహారం 'మేలెరిగిన మనిషి'.

**– బెహరా ఉమామహేశ్వరరావు,**
***బాలసాహితీవేత్త, జాతీయ ఉత్తమఉపాధ్యాయ అవార్డు గ్రహీత, పార్వతీపురం***

"మేలెరిగిన మనిషి" బాలల కథల సంపుటిలోని కథలన్నీ చాలా మంచి కథలు. రచయితకు అభినందనలు..

***– శ్రీ పి.వి.బి.శ్రీరామమూర్తి, ప్రముఖ రచయిత, పార్వతీపురం***

ఈ సంపుటిలోని కథలు మా పిల్లలు ప్రారంభించినది మొదలు పూర్తయ్యే వరకు ఏకబిగిన చదివారు. అంతగా నచ్చాయి వారికి. నేనూ మొత్తం చదివాను. అల్పబుద్ధి కథ అన్నిటికంటే బాగా నచ్చింది నాకు.

***– శ్రీ పుట్టగుంట సురేష్‌కుమార్, ప్రముఖ రచయిత, హైదరాబాద్.***

కథలన్నీ చదివాను. అద్భుతమైన బిగితో, చక్కటి శైలితో అద్యంతం ఆనందపరచేలా ఉన్నాయి.

***– శ్రీ డి.కె.చదువుబాబు, బాలసాహిత్య రచయిత, ప్రొద్దుటూరు-516361.***

"నారంశెట్టి ఉమామహేశ్వరరావుగారి 'మేలెరిగిన మనిషి' బాలల కథల సంపుటిలోని కథలు చదివాను. కథలంటే ఇలా ఉండాలి అని నిర్వచించేలా ఉన్నాయి. రచయితకు అభినందనలు..

***– శ్రీ అమ్మిన శ్రీనివాసవరాజు, తెలుగు లెక్చరర్, చర్ల***

'మేలెరిగిన మనిషి' పుస్తకంలోని కథలన్నీ సులభ శైలిలో పిల్లలు చదువుకొనేందుకు అనువుగా రాసిన రచయితకు అభినందనలు.

***– శ్రీ వల్ల పరిశినాయుడు, నఖచిత్రకారుదు, నాగూరు.***

'మేలెరిగిన మనిషి' కథ అద్యంతం ఆసక్తికరంగా సాగి ఎన్నో మలుపులు తిరిగి ఆశ్చర్యకరమైన ముగింపుతో పూర్తవుతుంది. మంచి నీతిదాయకమైన కథ. ఇతరులకు మేలుచేయాలన్న మంచి ఆలోచన రేకెత్తిస్తుంది పిల్లల్లో! ఈ సంపుటిలోని కథలన్నీ సమాజహితం కోరేవిగా ఉన్నాయి.

***– శ్రీ కె.వి.రమణారెడ్డి, కవి 'అశ్రుజల', మార్కాపురం.***

అర్థవంతపు భావసందేశం కల్గిన పిల్లల కథలతో కేవలం పిల్లల చేతనే కాక పెద్దల చేత కూడా చదివించగలిగే సత్తా ఉన్న ఉత్తమ కథల సంపుటి శ్రీ నారంశెట్టి ఉమామహేశ్వరరావుగారి 'మేలెరిగిన మనిషి' కథల సంపుటి. ముఖచిత్రం, అంతరచిత్రాలు శ్రీ తుంబలి శివాజీ కుంచె ఒలికించిన సుందరాకృతులు.

***– శ్రీ ఎన్నీ రఘువీరప్రతాప్, ప్రముఖ కవి, రచయిత, హైదరాబాద్.***

• • • • • • • • • • • • • • • • • • • •



Scanned with CamScanner

# కథల చందమామ - చిన్నారుల మేనమామ 'నారంశెట్టి'



స్పందించే గుణం గలవారే కళాకారులుగా మారతారు. ముఖ్యంగా సాహిత్యప్రక్రియల్లో కథలకు ఎప్పుడూ ప్రథమస్థానం చెదిరిపోకుండా ఉంటుంది. ఈ మధ్య కాలంలో కథలు చాలా మంది వ్రాస్తున్నారు. వారిలో కొందరు కథలు వ్రాయడానికే జీవిస్తున్నవారు, మరికొందరు పేరు కోసం కథలు వ్రాస్తున్నవారు ఉన్నారు. అందులో ప్రథమ శ్రేణికి చెందినవారు శ్రీ నారంశెట్టి ఉమామహేశ్వరరావు.

బాలల కథలు వ్రాసేవారిలో నాకు ముగ్గురు స్నేహితులున్నారు. వారిలో నారంశెట్టి కథలు ప్రత్యేకంగా అనిపిస్తాయి. గతంలో ఆయన వెలువరించిన 'మేలెరిగిన మనిషి' కథల సంపుటి పాఠకులను ఎంతగానో అలరించింది. ఆ కథలు నన్ను పుష్పకవిమానం ఎక్కించుకుని, ఎప్పుడో నానుండి జారిపోయిన బాల్యంలోకి విసిరేశాయి. నారంశెట్టి కథలువిజ్ఞాన వినోదాలను పంచడమే కాకుండా పసిహృదయాలపై పసివాడని వెన్నెల సంతకాలు చేస్తాయి. ఆయన కథలు చదువుతుంటే చిన్నారులకు(పెద్దలకు కూడా) మణిరత్నం సినిమా చూస్తున్న అనుభూతి కలుగుతుంది అని చెప్పడం ఎంత మాత్రమూ అతిశయోక్తి కాదు.

నారంశెట్టి ఎంచుకున్న కథాసందర్భాలు సామాన్యమైనవిగా కనిపిస్తాయి. కానీ ఆయన కథ చెప్పే తీరు మాత్రం పిల్లల్ని అడుగడుగునా ఆశ్చర్యానికి గురిచేస్తుంది. ఈ సందర్భంగా నేను నారంశెట్టి హృదయాన్ని "బాలల కథల ఆలయం" గా అభివర్ణిస్తున్నాను. ఆయన చిన్నారుల మేధోవికాసం కోసం కలం హలం పట్టి కథల పంటలు పండిస్తున్న రచయిత. ఎంత ఎదిగినా ఒదిగి ఉండే సంస్కార సహృదయత నారంశెట్టి సొంతం. సుమారు **600** పైగా కథలు వ్రాసిన నారంశెట్టి నిరంతరం వ్రాయరు. ఆయన కలం కదిలితే ఆగదు. ఆగితే కదలదు. ఇలా ఎందుకు విమర్శ చేశానంటే ... చక్కని కథలు వ్రాసే నారంశెట్టి ఉద్యోగపరంగా తీరికలేకుండా ఉండడం వలన దాదాపు ఎనిమిది సంవత్సరాలు కథలు వ్రాయకుండా ఉన్నారు. అద్భుతంగా వ్రాసే రచయితలు వ్రాయకుండా ఉండడం సమాజానికి అన్యాయం చేసినట్టే! నారంశెట్టిని మళ్ళీ అంతటి సుదీర్ఘ విరామం తీసుకోకుండా, తెలుగు పాఠకుల్ని కథల విహారం చేయిస్తారని ఆశిస్తున్నాను. నారంశెట్టిని చూస్తే ఒక మాట చెప్పాలనిపిస్తుంది, తీరిక లేకుండా ఉండేవారే మంచి కథలు వ్రాస్తారని. బాలల మేలెరిగిన రచయిత నారంశెట్టి ఉమామహేశ్వరరావుకు శుభాభినందనలు.



- మౌనశ్రీమల్లిక్
సినీగేయరచయిత,
హైదరాబాద్

Scanned with CamScanner